www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
04 అక్టోబర్ 2026
సంపుటి:4 సంచిక: 269

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## డిలీట్ అయిన ఓటర్లే టార్గెట్

- ఓటర్ల రీ-వెరిఫికేషన్ - 44 లక్షల మంది తిరిగి చేరే అవకాశం
- కొత్త దరఖాస్తులు - ఫామ్-6 ద్వారా 4.43 లక్షల అప్లికేషన్లు
- నామమాత్రపు స్పందన - ఓటర్ల నుంచి ఆశించినంత లేని స్పందన
- బీఎల్వోల సమస్య - ఫిజికల్ అప్లికేషన్లు అందుబాటులో లేకపోవడం
- టెక్నికల్ ఇబ్బందులు - ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు
- పార్టీల కసరత్తు - గడువు సమీపిస్తుండటంతో అప్లికేషన్లపై దృష్టి

03

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి



- ప్రధాన ఆసుపత్రుల నిర్మాణాల వేగవంతం
- వైద్య సిబ్బంది నియామకాల ప్రక్రియ ప్రారంభం
- అత్యాధునిక వైద్య పరికరాల సమకూర్పు
- కలెక్టర్లతో పాఠశాలలు, ఆసుపత్రుల వారంవారీ సమీక్ష
- ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల చర్చ

02




## తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పూర్తయ్యేది ఎప్పుడో..?

- పేద విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లోనే కార్పొరేట్ స్థాయి విద్య
- 4 ఎకరాల స్థలంలో డిజిటల్ క్లాసులు, లైబ్రరీలు, మైదానాలు
- విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్
- రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభం
- తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల ఏర్పాటు
- తక్కువ విద్యార్థులున్న బడులను టీపీఎస్‌లలోకి మార్పు

02



# మద్యం మత్తులో తెలంగాణ పల్లెలు

### మద్యం వినియోగంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానం

- 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 43.3శాతం మంది మందు సేవనం
- పట్టణాల 33.3శాతం కంటే గ్రామాల్లోనే 49 అధికం
- బెల్ట్ షాపుల విస్తరణ వల్లే గ్రామాల్లో పెరిగిన వినియోగం
- పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం
- అనధికార బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని విజ్ఞప్తి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గ్రామీణ తెలంగాణలో మద్యం ఏరులై పారుతుందనే విషయంపై 'ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్' సంస్థ సీఎం రేవంత్ రెడ్డికి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఒక వినతి పత్రం సమర్పించింది. దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో తెలంగాణ రాష్ట్రం అత్యున్నత స్థానాల్లో నిలవడం గమనార్హం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలను ప్రస్తావిస్తూ ఈ సంస్థ కొన్ని నిఘా విషయాలను బయటపెట్టింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే పల్లెటూర్లలో మందు అలవాటు విపరీతంగా పెరిగిపోయిందని స్పష్టం చేసింది. ముఖ్యంగా గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపుల కారణంగా సామాన్య ప్రజల జీవితాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన చెందింది. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అనధికారికంగా నడుస్తున్న దుకాణాలను వెంటనే మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో పెరుగుతున్న ఈ రుగ్మతను అరికట్టడానికి ప్రజలందరూ కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే రాబోయే రోజుల్లో యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదిక ప్రకారం తెలంగాణలో 15 సంవత్సరాలు



02

## 60% డిస్కౌంట్ ముసుగులో 100% దోపిడీ

- వినియోగదారులను ప్రలోభ పెడుతున్న సీజనల్ ప్రకటనలు
- అవగాహన ఉన్నప్పటికీ తప్పదోవ పడుతున్నామని కస్టమర్స్ గగ్గోలు
- కంపెనీల మోసాలపై దృష్టి సారించిన వినియోగదారుల పరిరక్షణ సంస్థ




## ఆయుధాల చోరీ.. 8 మంది అరెస్ట్

- బొల్లారం మిలిటరీ ఆయుధాల చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 12 ఆయుధాలు, 1,912 బుల్లెట్లు స్వాధీనం
- బ్యాంకులు, జ్యువెలరీ షాపుల్లో దోపిడీకి కుట్ర
- ఉగ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు లేవు
- విలేకరుల సమావేశంలో సీపీ బి. సుమతి వెల్లడి

02

# సర్కార్ దవాఖానల్లో దుస్థితి?

### ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితిపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం



- సర్కార్ దవాఖానల్లో ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేదని ఆరోపణ
- ఆదిలాబాద్ రిమ్స్, భూపాలపల్లి ఆస్పత్రుల్లో జరిగిన ఘటనలు
- మందులు, బెడ్లు అందక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్న వైనం
- ప్రభుత్వ ఆస్పత్రుల లోపాలను ఎండగట్టే ప్రత్యేక కార్యక్రమం
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించనున్న నేతలు

03



## కాంగ్రెస్ కరువు తెచ్చింది..!

- నీళ్లు పారితే ప్రజలకు కేసీఆర్ గుర్తొస్తడని కాళేశ్వరం మోటార్లు ఆన్ చేస్తలేరు
- బాండ్ పేపర్ కు ఉండే ఇజ్జత్ కూడా కాంగ్రెస్ వాళ్లు తీసేశారు
- కేసీఆర్ హయాంలో నర్సాపూర్-మెదక్ డబుల్ లైన్ వేసింది మనం చూశాం
- మనుషులే లేని ఫ్యూచర్ సిటీకి 10 వేల కోట్లు ఎందుకు?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపాటు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కళ్లెదుట గోదావరి నీళ్లున్నా మోటార్లు ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. నీళ్లు పారితే ప్రజలకు కేసీఆర్ గుర్తొస్తాడని కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయడం లేదని విమర్శించారు. శ్రీశైలంలో నిండుగా నీళ్లున్నా కల్వకుర్తి మోటార్లను 8 గంటలే నడుపుతున్నారన్నారు. సమ్మక్క బ్యారేజీలో నీళ్లున్నా దేవాదుల మోటార్లను కూడా 8 గంటలే నడుపుతున్నారని ఫైరయ్యారు. ఇది కాలం తెచ్చిన

మిగతా 2లో..

ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉప ఎన్నికల అంశం ఇప్పుడు రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ మీద కోర్టు అనర్హత వేటు వేసింది. దీంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే గత ఎన్నికల ఫలితాల అనంతరం దానం నాగేందర్ అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇచ్చాడని తాను వేసిన పిటీషన్ ఇంకా కోర్టులో విచారణలో ఉంది.

## ఖైరతాబాద్ బరిలోకి మాధవీలత, చీకోటి !

- దానం నాగేందర్ పై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక
- ఎన్నికలు వాయిదా వేయాలని విజయారెడ్డి కోర్టును ఆశ్రయించారు
- బీజేపీ నుండి సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి మరోసారి టికెట్
- హైదరాబాద్ మాజీ ఎంపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలత పేరు తెరపైకి వచ్చింది
- బీజేపీ నేత చీకోటి ప్రవీణ్ కుమార్ కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు
- అభ్యర్థుల ఎంపికపై బీజేపీలో పోటీ పెరగడంతో రాజకీయ వాతావరణం





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆ తీర్పు వచ్చే వరకు ఉప ఎన్నికలు జరపవద్దని గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన పి.విజయారెడ్డి కోర్టులో పిటీషన్ వేయడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. అయినప్పటికీ భారతీయ జనతాపార్టీ నుండి ఈసారి బరిలోకి ఎవరు దిగుతారనే విషయంలో కొత్త కొత్త పేర్లు తెరమీదకు వస్తున్నాయి. 2009 ఎన్నికల నుండి బీజేపీ తరపున చింతల రామచంద్రారెడ్డి వరుసగా పోటీ చేస్తూ వస్తున్నారు. 2014లో విజయం సాధించిన ఆయన 2009, 2018, 2023లలో ఓటమి పాలయ్యారు. చింతల రామచంద్రారెడ్డి గత ఎన్నికల్లో 2009లో 16,062 ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఆ తరువాత 2014 ఎన్నికల్లో ఏకంగా 53,102 ఓట్లు సాధించి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ మీద 20,846 ఓట్ల భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించారు. కానీ ఆ తర్వాత కాలంలో పరిస్థితులు మారాక 2018 ఎన్నికల్లో 34,666 ఓట్లకు పడిపోయారు. ఇక తాజా 2023 ఎన్నికలలో 38,094 ఓట్లకు మాత్రమే పరిమితం కావాల్సి వచ్చింది.

మిగతా 3లో..



03

## మొరాయించిన మెట్రో ఎస్కలేటర్

- డిప్యూటీ సీఎం, మంత్రులకు చేదు అనుభవం
- కాంగ్రెస్ సర్కార్ డొల్లతనం తేటతెల్లం.. నవ్వుకుంటున్న ప్రయాణికులు

## బస్సు బోల్తా.. ఐదుగురు దుర్మరణం

- వికారాబాద్ అనంతగిరి ఘాట్‌రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా
- ప్రమాదంలో ఐదుగురు మృతి, 15 మందికి తీవ్ర గాయాలు
- అంత్యక్రియలకు వెళ్తుండగా 54 మందితో వెళ్తున్న బస్సు ప్రమాదం
- క్షతగాత్రులకు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందజేత
- బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు కేటీఆర్ ప్రగాఢ సానుభూతి

03



# కాంగ్రెస్ కరువు తెచ్చింది..!

**మొదటి పేజీ తరువాయి**

కరువు ఎట్లయితదని నిలదీశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా ఎవరైనా ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలోకి వెళ్తారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఆ పార్టీ ఖాళీ అవుతోందంటే వారి పని అయిపోయిందని అర్థం. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయి. కానీ చేతలు గడప దాటడం లేదని ప్రజలకు అర్థమైపోయింది. ఊళ్లలో కాంగ్రెస్ వాళ్లమని చెప్పుకోవడానికే నాయకులు భయపడుతున్నారు. కేసీఆర్ వేసిన రోడ్లకు గుంతలు పడితే కనీసం డాంబర్ వేసి పూడ్చే తెలివి ఈ ప్రభుత్వానికి లేదు. కాగజ్ మద్దూర్ రోడ్లకు మోకాలి లోతు గుంతలు పడి గర్భిణీలు ఆసుపత్రికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. ప్రజల రోడ్లకు గుంతలు పూడ్చమంటే పైసలు లేవంటారు కానీ.. మనుషులు, ఊరు, వాడ లేని ఫ్యూచర్ సిటీ దగ్గర మాత్రం పదివేల కోట్లు పెట్టి ఆరు వరుసల రోడ్లు వేస్తున్నారు.

**గుంతల రోడ్ల మీద లేదా?**

నీ అనుయాయుల భూముల ధరలు పెంచుకోవడానికేనా ఈ ఫ్యూచర్ సిటీ రోడ్లు అని రేవంత్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా. నీ ఇంటెలిజెన్స్ ఎంతసేపు ప్రతిపక్షాల మీదేనా? ఈ గుంతల రోడ్ల మీద లేదా? మంత్రుల నియోజకవర్గాల్లోనే రోడ్లకు దిక్కులేదని ప్రజలు వచ్చి మొరపెట్టుకుంటున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు నర్సాపూర్‌హైదరాబాద్, నర్సాపూర్‌మెదక్ రోడ్లను ఎంత అద్భుతంగా డబుల్ లైన్ చేశారో అందరూ చూశారు. కేసీఆర్ కట్టించిన దావఖానాలను నిర్వీర్యం చేశారు. నర్సాపూర్ ఆసుపత్రికి వెళ్తే కనీసం అయోడిన్, టీటీ ఇంజెక్షన్ కూడా లేదు, స్టిచ్చింగ్ మెటీరియల్ కూడా బయట కొనుక్కోమంటున్నారు. ఎన్నికల ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఇస్తామని బాండ్ పేపర్లు రాసిచ్చి ఊరూరు తిరిగారు. వంద రోజులు పోయి వెయ్యి రోజులు దాటుతున్నా ఆ బాండ్ పేపర్లకు దిక్కులేదు. బాండ్ పేపర్ కు ఉండే ఇజ్జత్ కూడా కాంగ్రెస్ వాళ్లు తీసేశారు. బాండ్లను బొందపెట్టి, గ్యారెంటీలకు గోరీ కట్టారు. అవ్వలకు నెలకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. పెంపు లేదు సరికదా నెలకు 2 వేల చొప్పున లెక్కేసుకున్నా 34 నెలలకు ఒక్కో అవ్వకు రేవంత్ రెడ్డి



రూ. 68 వేలు బాకీ పడ్డాడు. కాంగ్రెస్ వాళ్లు కనబడితే అవ్వలు ఆ బాకీ డబ్బులు నిలదీసి అడగాలి.

**వెనుక మడి ఎండుతోంది..**

రైతుబంధు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి, కేసీఆర్ ఇచ్చే పదివేలు కూడా ఇవ్వకుండా మూడు సీజన్ల పాటు ఎగ్గొట్టి రైతులను నట్టేట ముంచారు. తడిగుడ్డతో గొంతు కోసే రకం రేవంత్ రెడ్డి అని ప్రజలు ఇప్పుడు గ్రహిస్తున్నారు. రామాయంపేట రైతులు నాకు ఫోన్ చేసి.. కరెంటు లేక పంటలు ఎండుతున్నాయని, మోటార్లు కాలుతున్నాయని రోడ్డెక్కి ధర్నా చేస్తున్నామని, అక్కడికి రమ్మని పిలిచారు. బాయికాడ పని చేసుకోవాల్సిన రైతులు సబ్‌స్టేషన్ల ముంగట రోడ్డెక్కి ధర్నా చేసే దౌర్భాగ్య పరిస్థితిని ఈ కాంగ్రెస్ తెచ్చింది. బాయికాడ ఆరు, ఏడు గంటల కరెంటు కూడా నిండుగా రావడం లేదు. గంటకోసారి ట్రిప్ అవుతోంది, వెనుక మడి ఎండుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కన్నెపల్లిలో మోటార్లు ఆన్ చేస్తే మా నర్సాపూర్, మంజీరాకు పుష్కలంగా గోదావరి నీళ్లు వస్తాయి. ఆనాడు కేసీఆర్ ఉన్నప్పుడు ఏప్రిల్, మే నెలల మండుటెండల్లో కూడా 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చారు. రూ. 4500 కడితే వ్యవసాయ కనెక్షన్ ఇచ్చారు, కాలిపోయిన వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చి పెట్టారు. కాంగ్రెస్ వచ్చాక వ్యవసాయ కనెక్షన్ డిపాజిట్ చార్జీలు రూ. 10 వేలకు పెంచారు. కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఇవ్వడానికి రోలింగ్ స్టాక్ లేదు. లంచం ఇస్తే తప్ప ట్రాన్స్‌ఫార్మర్ రాని పరిస్థితి దాపురించింది. కరెంటు కోతలకు ఎల్ నినో కారణమని కాంగ్రెస్ కుంటిసాకులు చెబుతోంది. ఇది ఎల్ నినో తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కోత. ఆరు, ఏడు నెలల ముందే వాతావరణ శాఖ హెచ్చరించినా ముందస్తుగా బొగ్గు నిల్వ చేసుకోకుండా, ఒప్పందాలు చేసుకోకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు నాటకాలు ఆడుతున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కేసీఆర్ కరెంటు ఆపలేదు, రైతుబంధు ఆపలేదు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కరోనా కంటే డేంజర్ గా తయారైంది. మన రాష్ట్రంలో కరెంటుకు దిక్కులేదు కానీ.. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో నిర్మించిన సింగరేణి థర్మల్ ప్లాంట్ 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు అమ్ముకోవడానికి జాయింట్ వెంచర్ చేసుకున్నారు. తెలివి ఉన్నోడు ఎవడైనా ఈ పని చేస్తాడా? దీన్ని వెంటనే రద్దు చేసి ఆ కరెంటు మనకే వాడుకోవాలని నేను లేఖ రాశాను.

**పాత రోజులంటే ఏమో అనుకున్నం..**

సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని నేను ఆరు నెలల క్రితమే బయటపెట్టాను. వాస్తవాలు చూపిద్దామని నేను రామగుండం, కొత్తగూడెం, భూపాలపల్లి వెళ్తుంటే నన్ను అడుగడుగునా పోలీసులు అరెస్టు చేశారు. నేడు బొగ్గు లేక కొత్తగూడెం, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్లలో సుమారు 2500 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి ఆగిపోయింది. రేవంత్ రెడ్డి పాత రోజులు తెస్తానంటే ఏమో అనుకున్నాం.. కరెంటు లేక బాయి కాడ పండుకునే రోజులు, ఎరువుల కోసం పోలీస్ స్టేషన్ల ముంగట చెప్పులు లైన్లో పెట్టే పాత కష్టాలను మళ్లీ తెచ్చాడు. కేసీఆర్ కట్టించిన దావఖానాలను నిర్వీర్యం చేశారు. నర్సాపూర్ ఆసుపత్రికి వెళ్తే కనీసం అయోడిన్, టీటీ ఇంజెక్షన్ కూడా లేదు, స్టిచ్చింగ్ మెటీరియల్ కూడా బయట కొనుక్కోమంటున్నారు. ఆడబిడ్డలకు భరోసా ఇచ్చిన కేసీఆర్ కిట్ బంద్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కన్నెపల్లిలో మోటార్లు ఆన్ చేస్తే మా నర్సాపూర్, మంజీరాకు పుష్కలంగా గోదావరి నీళ్లు వస్తాయి. అన్నారం, సుందిల్ల బ్యారేజీలు సురక్షితంగా ఉన్నాయని నివేదికలు వచ్చాయి. నీళ్లు వాడుకోవచ్చని ఎన్‌డీఎస్ఏ కూడా హైకోర్టుకు కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. కళ్ల ముంగట నీళ్లున్నా ఎత్తకపోతే ఇది కాలం తెచ్చిన కరువు ఎలా అవుతుంది? నీళ్లుంటే పంట పండుతుంది, పంట పండితే యూరియా ఇవ్వాలి, చేతికొచ్చాక వడ్లు కొనాలి.. ఈ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే నీళ్లు, కరెంటు ఇవ్వకుండా కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది. కొమురవెల్లి మల్లన్న, భద్రాద్రి రామయ్య, యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి, ఏడుపాయల అమ్మవారు, మెదక్ చర్చి మీద ఒట్లు పెట్టి ఆగస్టు కల్లా రుణమాఫీ చేస్తానని చెప్పి.. దేవుళ్లను సైతం మోసం చేసిన ఘరానా మోసగాడు ఈ రేవంత్ రెడ్డి అని హరీశ్ రావు ధ్వజమెత్తారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి సమక్షంలో పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## ఆయుధాల చోరీ.. 8 మంది అరెస్ట్

**విశాలభారతి, మారేడ్‌పల్లి**

బొల్లారం మిలిటరీ ఏరియాలో జరిగిన అత్యాధునిక ఆయుధాల చోరీ కేసును మల్కాజిగిరి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మాజీ హవిల్దార్‌తో పాటు అంతరాష్ట్ర ముఠాకు చెందిన మొత్తం 8మంది నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైన 12 ఆయుధాలు, 1,912 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి సహకరించినవారు, ఆయుధాలను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నవారు, సాయుధ దోపిడీలకు పథకం వేసిన వారి పాత్రలను దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బి. సుమతి శనివారం సికింద్రాబాద్‌లోని మల్కాజిగిరి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఉప్పుతోళ్ల మల్లేష్ అలియాస్ రాజు (37) గతంలో మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో హవిల్దార్‌గా పని చేసి పదవీ విరమణ పొందాడు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు భారీ దోపిడీలకు ప్రణాళిక రూపొందించాడు. గతంలో తనతో పని చేసిన కొండూరి శేషులు, వినోద్‌కుమార్, కుచరకంటి ప్రవీణ్ సహకారంతో ఆగస్టు 31న బొల్లారం మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్ ఆయుధాగారం, మందుగుండు సామగ్రి నిల్వ గది తాళాలు పగులగొట్టి అత్యాధునిక ఆయుధాలను చోరీ చేశారు. ఆగస్టు 31న ఉదయం 7.50 గంటలకు చోరీ జరిగినట్లు గుర్తించిన సైనిక అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో బొల్లారం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మల్కాజిగిరి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. గతనెల 11న అందిన సమాచారం ఆధారంగా ప్రధాన నిందితుడు మల్లేష్‌ను అచ్చంపేటలో అదుపులోకి తీసుకొని, చోరీ చేసిన ఆయుధాలను అచ్చంపేటలోని తన తండ్రి ఇంట్లో దాచిపెట్టిన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

**రూ. లక్షల్లో ఆయుధాల కొనుగోలు ఒప్పందం**

ప్రధాన నిందితుడిని గతనెల 22 నుంచి ఈనెల 1 వరకు పది రోజుల పాటు పోలీసు కస్టడీలో విచారించడంతో చోరీ వెనుక ఉన్న కుట్ర వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆయుధాల వ్యాపారులు అవిడే అలియాస్ ఓబి, బీర్బల్ షా చోరీ చేసిన ఆయుధాలను కొనుగోలు చేసేందుకు అంగీకరించినట్లు విచారణలో వెల్లడైనట్లు సీపీ సుమతి తెలిపారు. ఒక్కో పిస్టల్‌కు రూ. 3 లక్షలు, ఒక్కో రైఫిల్‌కు రూ. 5లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆయుధాల కొనుగోలుకు సహకరించిన ఇద్దరితో పాటు స్థానికంగా సాయుధ దోపిడీలకు పథకం వేసిన మల్లికార్జున్, నిరంజన్‌లను కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

**దోపిడీలే లక్ష్యంగా కుట్ర...**

మల్లికార్జున్, నిరంజన్‌లతో కలిసి బ్యాంకులు, నగల దుకాణాలు, సంపన్నులను లక్ష్యంగా చేసుకొని సాయుధ దోపిడీలకు పాల్పడడానికి ప్రధాన నిందితుడు మల్లేష్ పథకం వేశాడు. గతంలో మల్లేష్ పై అచ్చంపేట, అమ్రాబాద్



పోలీసు స్టేషన్‌లలో చోరీ కేసులు నమోదయ్యాయని, అవిడే పై పశ్చిమ బెంగాల్ లో ఆయుధాల చట్టం కింద కేసు పెండింగ్ లో ఉందని తెలిపారు. ఈ ముఠాకు ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మల్లేష్‌ను ఇప్పటికే జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించగా, మిగిలిన ఏడుగురిని నిందితులను శనివారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు సీపీ సుమతి వెల్లడించారు.

**భారీ ఆయుధాలు స్వాధీనం..**

నిందితుల నుంచి నాలుగు ఏకే203 రైఫిళ్లు, ఐదు మ్యాగజైన్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, మూడు మ్యాగజైన్లు, ఆరు 9 ఎంఎం పిస్టళ్లు, 1,156 పిస్టల్ బుల్లెట్లు, 720 ఏకే203 బుల్లెట్లు, 36 ఇన్సాస్ బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. మొత్తం 1,912 బుల్లెట్లును, 5 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు వెల్లడించారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పూర్తయ్యేది ఎప్పుడో..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నేటి బాలలే రేపటి పౌరులు.. విద్య లేనివాడు వింత పశువు అనే సూక్తులు మనం వింటుంటాం. ప్రపంచాన్ని మార్చాలంటే మీరు ఉపయోగించే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని నెల్సన్ మండేలా అన్న సూక్తి మనకు తెలిసిందే. పిల్లలందరూ దేశానికి సంపద లాంటి వారు.. భారతదేశ భవిష్యత్ మూలస్తంభాలకు వారే కీలకం. అందుకే చిన్నారులకు మెరుగైన విద్య సౌకర్యాలను అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందున్న ఏకైక లక్ష్యం. అటు అక్షరాస్యతను ప్రాథమిక మానవ హక్కుగా యునెస్కో ఎప్పుడో గుర్తించింది. ఇక ప్రస్తుతం వికసిత్ భారత్ దిశగా మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధికి అక్షరాస్యత నిజమైన పునాది లాంటిది. అందుకోసమే ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక కీలక మార్పులను తీసుకొచ్చింది. ఎప్పటినుంచో ఉన్న 10+2 విద్యా విధానానికి స్వస్తి చెప్పి పాఠశాల విద్యా వ్యవస్థలో మార్పులు చేస్తూ 5+3+3+4 విధానాన్ని తీసుకొచ్చింది. అలానే మాతృభాషకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రాథమిక విద్యలో 5 వ తరగతి వరకు వీలైతే 8 వ తరగతి వరకు విద్యార్థులకు బోధన మాతృభాషలోనే లేదా ప్రాంతీయ భాషలోనే జరగాలని నూతన విద్యా విధానం చెబుతోంది. ఇక తెలంగాణలోనూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల కోసం మెరుగైన సౌకర్యాలను అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను, కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు ధీటుగా నిర్మిస్తూ అన్ని వసతులను ఏర్పాటు చేస్తోంది. ఇక తెలంగాణలో ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంలో పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కార్యక్రమమే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ విధానం. ఈ సంచలన నిర్ణయం ద్వారా ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి విద్యను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో డిజిటల్ తరగతులు, లైబ్రరీలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్‌ను అందించనున్నారు. అంతేకాక విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు స్కూల్ బస్సులను కూడా ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు రాష్ట్రంలోని 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంఖ్యను రానున్న కాలంలో మరింత పెంచనున్నారు. ఇక ఇప్పటికే రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తొలి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒక్కో పాఠశాలను సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఒక్కో టీపీఎస్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 60 కోట్లు ఖర్చు చేస్తోంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలను ఇందులో విలీనం చేసి ఒకే చోట ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ నిర్ణయంగా ఉంది. ఇక ప్రభుత్వం టీపీఎస్ స్కూల్‌స్‌ను ఏర్పాటు చేయడంపై నూతన్ కల్ మండలానికి చెందిన వంశీ అనే ఉపాధ్యాయుడు మాట్లాడుతూ.. టీపీఎస్ స్కూల్స్ వల్ల విద్యార్థుల భవితవ్యం మారుతుందని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌కు ధీటుగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయడం కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అయితే ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో సబ్జెక్ట్‌కు ఒక టీచర్ లేరని.. 15 వ తరగతి విద్యార్థులందరినీ ఒకే గదిలో కూర్చొబెట్టి ఒకే టీచర్‌తో పాఠాలు చెబుతున్నామని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రాథమిక పాఠశాలలకు




వసతులు మెరుగైనట్లు వివరించారు. పాఠశాలకు రంగులు వేశారు. కొత్త ఫర్నీచర్ అందించారని తెలిపారు. ఇలాంటి చిన్న చిన్న పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ మంది ఉంటారు కాబట్టి వాటిని టీపీఎస్‌లలో విలీనం చేయాలని కోరారు. ఇక నూతనకల్ మండలానికే చెందిన సాయి కుమార్ అనే డిగ్రీ విద్యార్థి మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ పాఠశాలలోనే 10 వ తరగతి వరకు చదివానని అప్పుడు ఇన్ని వసతులు లేవని తెలిపాడు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు. తమకు కేవలం కంప్యూటర్ క్లాస్‌లు మాత్రమే చెప్పేవారని కానీ ఇప్పుడు డిజిటల్ బోధన ఎంతో మెరుగైందని అన్నాడు. ఇక తమ డిగ్రీ కాలేజీలో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం లేదని.. ఇతర డిగ్రీ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్నారని తెలిపాడు. మరోవైపు నవీన అనే ఇంటర్ విద్యార్థిని వన్ మాట్లాడుతూ.. తాను టెన్త్ వరకు నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివానని తెలిపింది. అయితే తమకు సరైన ప్లే గ్రౌండ్ కూడా ఉండేది కాదని.. ఫీజులు మాత్రం అధికంగా తీసుకునేవారని వివరించింది. ప్రభుత్వం తీసుకొస్తున్న టీపీఎస్‌లతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని పేర్కొంది. ప్రతి మండలానికి ఇలాంటి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఉంటే తాము ప్రైవేట్ స్కూల్స్ కు వెళ్లే వాళ్లం కాదని తెలిపింది.

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో వైద్య రంగం తీరును పూర్తిగా మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని తన అధికారిక నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రధాన ఆసుపత్రుల పనులను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ నగర్ ఆసుపత్రి, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ తీరును పరిశీలించారు. ఈ నాలుగు ప్రాజెక్టుల పురోగతి గురించి అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. నిర్మాణ పనులు నత్తనడకన సాగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని గట్టిగా చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భవనాల నిర్మాణాలు పూర్తయ్యే నాటికి వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని సీఎం హెచ్చరించారు. ఆసుపత్రులు ప్రారంభమైన వెంటనే అన్ని విభాగాల్లో సేవలు అందాలంటే ముందే నియామక ప్రక్రియ పూర్తి కావాలని చెప్పారు. దీనికోసం ఇప్పటి నుంచే అవసరమైన సిబ్బంది సంఖ్యను గుర్తించి దరఖాస్తులను ఆహ్వానించాలని సూచించారు. భవనాలు సిద్ధమయ్యే సమయానికి అత్యాధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పదుల సంఖ్యలో వైద్యులు, వందలాది మంది పారామెడికల్ సిబ్బందిని సమకూర్చడానికి ప్రణాళిక సిద్ధం చేయాలి. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా లభించేలా



యంత్రాంగం పనిచేయాలని కోరారు. వైద్య శాఖలో ఏ చిన్న లోపం తలెత్తినా సహించేది లేదని అధికారులకు తేల్చి చెప్పారు. నిధుల కొరత లేకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలోనూ పడకల సామర్థ్యాన్ని పెంచి, రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రుల పరిస్థితిపై సీఎం తీవ్రంగా స్పందించారు. జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని కఠిన ఆదేశాలిచ్చారు. ఏ ఒక్క పాఠశాలలోనూ మౌలిక వసతులు లోపించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మరమ్మతులు అవసరమైన చోట తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుగానే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించి పురోగతిని నివేదించాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలి. రాబోయే డిసెంబర్ నెలలో భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ భారీ సమ్మిట్ ఏర్పాట్లపై సమావేశంలో విస్తృతంగా చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే ప్రముఖ అతిథులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల కోసం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ను ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ఈ కార్యక్రమం ఉండాలని చెప్పారు. అతిథుల రవాణా, వసతి, భద్రత ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని డీజీపీని అప్రమత్తం చేశారు. సమ్మిట్ నిర్వహణ తీరుతెన్నులను త్వరలోనే స్వయంగా పరిశీలిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామికంగా తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. యువతకు లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు రాబట్టేందుకు ఈ గ్లోబల్ సమ్మిట్ వేదిక కానుంది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పరిపాలనా రంగంలో కొత్త మార్పులకు నాంది పలుకుతున్నాయి. ప్రభుత్వ సలహాదారు కె రామకృష్ణారావుతో పాటు సీఎంవో ఉన్నతాధికారులు అందరూ సమావేశంలో చురుగ్గా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఆసుపత్రుల నిర్మాణాలు, సిబ్బంది నియామకాలు, విద్యా సంస్థల అభివృద్ధి, గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు అనే నాలుగు ప్రధాన అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. ప్రతి శాఖకు నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించి వాటిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారుల మధ్య సమన్వయం ఉంటేనే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని సీఎం పునరుద్ఘాటించారు. ప్రజాధనం వృధా కాకుండా ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేలా పారదర్శకతతో పనులు జరగాలని ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాబోయే కాలంలో తెలంగాణ వైద్య, విద్యా రంగాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించే క్రమంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రత్యేక గ్రీవెన్స్ సెల్స్ పనిచేయాలని చెప్పారు. అభివృద్ధి సంక్షేమం జోడెడ్లలా ముందుకు సాగితేనే సమాజంలో గుణాత్మక మార్పు వస్తుందని ఆయన బలంగా నమ్ముతున్నారు. ఈ సమావేశంలో తీసుకున్న ప్రతి నిర్ణయం త్వరలోనే ఆచరణలోకి వచ్చేలా ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారుల పనితీరును స్వయంగా పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి త్వరలోనే జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలను పూర్తిగా మార్చివేయడమే తమ ప్రధాన ధ్యేయమని సీఎం తేల్చి చెప్పారు. ఈ అద్భుతమైన ప్రణాళికలు విజయవంతమైతే రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలకు నేరుగా మేలు జరుగుతుంది. రాబోయే రోజుల్లో తెలంగాణ అన్ని రంగాలలోనూ అగ్రగామిగా నిలవడానికి ఈ సమీక్ష ఒక బలమైన పునాదిగా మారుతుందని అందరూ భావిస్తున్నారు.

## 60% డిస్కౌంట్ ముసుగులో 100% దోపిడీ

- **వినియోగదారులను ప్రలోభపెడుతున్న సీజనల్ ప్రకటనలు**
- **అవగాహన ఉన్నప్పటికీ తప్పుదోవ పడుతున్నామని కస్టమర్స్ గగ్గోలు**
- **కంపెనీల మోసాలపై దృష్టి సారించిన వినియోగదారుల పరిరక్షణ సంస్థ**
- **వినియోగదారుల హెల్ప్‌లైన్ 1915కు ఫిర్యాదు చేయాలని వినతి**

**న్యూఢిల్లీ, విశాలభారతి**

పండుగల సీజన్ ప్రారంభమవడంతో ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలు భారీ సేల్స్‌కు సిద్ధం అవుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్ర తదితర వేదికల్లో ఇప్పటికే ముందస్తు ఆఫర్లు అందుబాటులోకి వచ్చాయి. భారీ తగ్గింపులు, పరిమిత కాల ఆఫర్లు, ప్రత్యేక డీల్స్ అంటూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అయితే 'ఇప్పుడే కొనకపోతే ఆఫర్



పోతుంది' అనే భావన కలిగించే సందేశాలు కనిపించినప్పుడు.. నిజంగానే అంత అత్యల్ప ధరకు వస్తువు లభిస్తుందా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. ఒక ఫోన్‌పై 30 శాతం తగ్గింపు, మరోవైపు 30 నిమిషాల్లో ముగుస్తుంది అనే కౌంట్‌డౌన్ కనిపించిందనుకోండి. ఆఫర్ మిస్ అవుతుందేమోనని కొందరు వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంది. అయితే కొద్ది రోజుల తర్వాత అదే ఫోన్ రెండు వారాల క్రితం 50 శాతం తగ్గింపుతో లభించిందని తెలిసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎందుకంటే డిస్కౌంట్ శాతం మాత్రమే గత ధరలతో పోలిస్తే ఆదా ఎంత అనేది వెల్లడికాదు. తగ్గింపు శాతం ఏ సూచిక ధరతో పోల్చి చెప్పారన్నదీ కీలకమే. 'ఇంకా రెండు మాత్రమే మిగిలాయి. 10 నిమిషాల్లో ఆఫర్ ముగుస్తుంది' వంటి సందేశాలు కొనుగోలు దారులను త్వరగా నిర్ణయం తీసుకునేలా ప్రభావితం చేయవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. 2023లో 195 మంది వయోజనులపై జరిగిన ఒక అధ్యయనంలో తక్కువ స్టాక్ సందేశాలు, కౌంట్‌డౌన్ టైమర్లు, పరిమిత కాల ఆఫర్లు వంటి నాలుగు రకాల 'డార్క్ ప్యాటర్న్స్'ను పరిశీలించారు. ఇవి ఉత్పత్తుల ఎంపికపై గణనీయమైన ప్రభావం చూపినట్లు అధ్యయనం వెల్లడించింది. 2026లో డేటమ్స్ ఇంటెలిజెన్స్ అధ్యయనం 50 నగరాల్లో 2,590 మంది వినియోగదారులను, ఈ కామర్స్, క్విక్ కామర్స్, ఆన్‌లైన్ ట్రావెల్‌కు చెంది 12 ప్రముఖ వేదికలను పరిశీలించింది. ఇందులో వినియోగదారులు డార్క్ ప్యాట్రన్ కారణంగా ఏటా రూ.25 వేల కోట్ల నుంచి రూ. 28 వేల కోట్ల వరకు నష్టపోతున్నారని అంచనా వేసింది. 81 శాతం మందికి వీటిపై అవగాహన ఉన్నప్పటికీ, తాము తప్పుదోవ పట్టినట్టు తెలిపారు. అయితే ప్రతీ అత్యవసర సందేశం డార్క్ ప్యాటర్న్ అని దీని అర్థం కాదు. నిజమైన స్టాక్ పరిమితులు, సమయ పరిమిత ఆఫర్లు కూడా ఉంటాయి. వినియోగదారులను అమితంగా ప్రభావితం చేసే 13 రకాల డార్క్ ప్యాటర్న్స్‌ను కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ గుర్తించింది. వాటిని అరికట్టేందుకు 2027 నుంచి అమల్లోకి వచ్చే కొత్త నిబంధనల్లో డార్క్ ప్యాటర్న్స్‌ను పరిష్కరించడం, వార్షిక స్వీయ ఆడిట్‌లను నిర్వహించడం, అనుసరణ ప్రకటనలను సమర్పించడంపై దృష్టి సారించనుంది.

# సర్కార్ దవాఖానల్లో దుస్థితి ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలోని సర్కార్ ఆస్పత్రుల దుస్థితి చూస్తుంటే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయింది. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా మండిపడింది. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు ప్రభుత్వ వైద్య రంగ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఐదుగురు పసికందులు మృతి చెందారు. ఈ విషాద ఘటనను ఎవరూ మరువకముందే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎస్ఎన్సీయూ వార్డులో సీలింగ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. సీలింగ్ కూలిన ఆ సమయంలో అదృష్టవశాత్తూ ఆ వార్డులో చిన్నారులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే మరో భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని అందరూ ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వరుస ఘటనలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత లేమికి అద్దం పడుతున్నాయి. ఈ తరహా పరిణామాలు రోగులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వైద్యారోగ్య శాఖకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం సర్కార్ ఆస్పత్రులు అత్యంత అధ్వానంగా తయారయ్యాయి. దవాఖానల్లో కనీస మందులు కూడా అందుబాటులో లేవు. పారిశుద్ధ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా మారి రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రుల్లో రోగుల సంఖ్యకు తగ్గట్లుగా వైద్యులు సరిపోవడం లేదు. సరిపడా బెడ్లు లేక పేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చివరికి రోగులకు కనీసం సాధారణ బెడ్లు కూడా లభించడం లేదు. వీల్ చైర్లలో



కూర్చోబెట్టి చికిత్స అందించే దౌర్భాగ్య స్థితికి మన వైద్య వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయింది. ఈ వైఫల్యాలపై బాధ్యులైన వారిని ప్రశ్నించాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వం ప్రకటనలకు వాస్తవ పరిస్థితులకు మధ్య చాలా తేడా ఉంది. క్షేత్రస్థాయిలో రోగులు పడుతున్న వేదన వర్ణనాతీతంగా ఉంది. సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ సమస్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షస పాలన వల్ల పూర్తిగా నాశనమైన ప్రభుత్వ ఆస్పత్రుల అసలు స్వరూపాన్ని ప్రజాక్షేత్రంలో బయటపెడతామని తెలంగాణ రక్షణ సేన గట్టిగా హెచ్చరించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆపరేషన్ బ్లూ కోడ్ పేరుతో ఒక కొత్త కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ప్రత్యక్షంగా సందర్శిస్తారు. ఆయా ఆస్పత్రులలో ఉన్న లోపాలను ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఎండగడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తామని చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ప్రభుత్వ తీరును ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ద్వారా ప్రభుత్వంలో కదలిక వస్తుందని ఆశిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కేవలం ప్రకటనలకే పరిమితమై క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరిస్తున్నారు. రోగుల ప్రాణాలు గాలికొదిలేసి పబ్లిసిటీ కోసం పాకులాడుతున్నారు. ఈ తీరును మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆపరేషన్ బ్లూ కోడ్ ద్వారా ప్రతి ఒక్క ఆస్పత్రి లోపాలను బయటపెడతాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తాం. రోగుల రక్షణే ధ్యేయంగా ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. బాధ్యత లేని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాధనం వృధా అవుతున్న తీరును ప్రజలకు వివరిస్తాం. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు ఈ ఉద్యమం చాలా కీలకం కానుంది. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ అంశాలను విస్తృతంగా ప్రచారం చేస్తాం. యువత అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. వైద్య రంగంలో వస్తున్న ఈ సమస్యలపై యువత గళం విప్పాల్సిన సమయం వచ్చింది. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య విధానం నేడు ప్రాణాలు తీసే స్థితికి చేరింది. దీన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలి. ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్ని ఆస్పత్రులలో మౌలిక వసతులు కల్పించాలి. లేదంటే రాబోయే రోజుల్లో ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. తెలంగాణ రక్షణ సేన చేపట్టిన ఆపరేషన్ బ్లూ కోడ్ విజయవంతం కావాలి. ప్రజలందరూ ఈ పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం మానుకోవాలి. ఇప్పటికైనా కళ్ళు తెరిచి ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేయాలి. రోగులకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందేలా చూడాలి. లేనిచో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం. ఈ పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని తేల్చి చెప్పారు.

## డిలీట్ అయిన ఓటర్లే టార్గెట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముసాయిదా జాబితా నుంచి డిలీట్ అయిన 93 లక్షల మంది ఓటర్లలో నోటీసులు అందుకుని డాక్యుమెంట్లు సమర్పించిన వారు 44 లక్షల వరకు తిరిగి చేరే అవకాశం ఉంది. దీనికి అదనంగా ఫామ్6 ద్వారా కొత్తగా ఓటర్లుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 4,43,193 అని సీఈవో వర్గాలు స్పష్టం చేశాయి. ఈ నెల 7వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండటంతో రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేకంగా కసరత్తు మొదలుపెట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ దరఖాస్తులు సమర్పించేలా చూస్తున్నారు. రాబోయే నాలుగు రోజుల్లో భారీగా అప్లికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఎలాంటి విచారణ లేకుండా ఓట్లు తొలగించారని బాధితులు ఆరోపిస్తున్నారు. త్వరలోనే వారంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోనున్నారు. పార్టీల శ్రేణులు బూత్ లెవల్ ఏజెంట్లు ముమ్మరంగా చొరవ తీసుకోవాలని ఇప్పటికే అగ్రనేతలు ఆదేశాలు జారీ చేశారు. గడువులోగా సరైన డాక్యుమెంట్లు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని సూచిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫామ్6 ఉపయోగించాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు అందిన అప్లికేషన్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని సీఈవో ఆఫీస్ వెల్లడించింది. దీనిపైన నామమాత్రంగానే స్పందన వస్తోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న బూత్ లెవల్ అధికారుల దగ్గర తగినన్ని ఫారాలు ఉన్నాయని చెబుతున్నారు. గ్రౌండ్ లెవెల్‌లో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. మా దగ్గర అప్లికేషన్లు లేవని బీఎల్వోలు నేరుగా చెబుతున్నారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఓటర్లకు సలహాలు ఇస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీల బీఎల్ఏలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టారు. ఆన్లైన్‌లోనే దరఖాస్తులు భర్తీ చేయించేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. యువతకు సహాయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసే సమయంలో వివరాలు నమోదు చేయడంలో తీవ్రమైన టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయి. డాక్యుమెంట్లు అప్లోడ్ చేసే దశలో వెబ్సైట్ సరిగా పనిచేయక ఓటర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ఫిజికల్ అప్లికేషన్లు అందుబాటులో లేకపోవడం మరోవైపు ఆన్లైన్ లో నెట్వర్క్ సమస్యలు చికాకు తెప్పిస్తున్నాయి. ఈ సాంకేతిక లోపాల కారణంగా అర్హులైన ఎంతోమంది యువకులు ఫైనల్ లిస్టులో చోటు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇంటింటికి తిరిగి పరిశీలన చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ స్థాయిలో పనితీరు కనబడకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులైన నిజమైన ఓటర్లకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. ఈ క్లిష్టమైన పరిస్థితిని ఎలా అధిగమించాలనే అంశంపై పార్టీలన్నీ తీవ్రంగా చర్చిస్తున్నాయి. చివరి క్షణంలో అయినా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సాంకేతిక లోపాలను సరిదిద్దాలని అందరూ కోరుకుంటున్నారు. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం యువత ఈ ఎన్నికల ప్రక్రియపై ఎంతో ఆసక్తిగా స్పందిస్తోంది.

## ఖైరతాబాద్ బరిలోకి మాధవీలత, చీకోటి !





**మొదటిపేజీ తరువాయి**

ఈ వరుస పరిణామాల నేపథ్యంలో ఈసారైనా చింతల రామచంద్రారెడ్డి స్థానంలో కొత్తవారిని బరిలోకి దించి ఓటర్లను ఆకట్టుకోవాలని బీజేపీ హైకమాండ్ తీవ్రంగా భావిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. మరి ఈసారైనా చింతల రామచంద్రారెడ్డికి పార్టీ మరోసారి టికెట్ దక్కించుకుంటుందా లేక అధిష్టానం మనసు మార్చుకుని పూర్తిగా కొత్త మొఖానికి అవకాశం ఇస్తుందా అనేది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తికరంగా మారింది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంటు స్థానానికి బీజేపీ తరపున పోటీ చేసిన కొంపెల్లి మాధవీలత ఇప్పుడు ఖైరతబాద్ శాసనసభ స్థానం నుండి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఆమె చేసిన ప్రచారం పలుమార్లు తీవ్ర వివాదాస్పదం అయిన సంగతి అందరికీ తెలిసిందే. పాతబస్తీలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ మీద పోటీ చేసిన ఆమె ఆ ఎన్నికల్లో ఏకంగా 3,23,894 ఓట్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇప్పుడు అదే జోరును కొనసాగించాలని భావిస్తూ అసెంబ్లీ బరిలోకి దిగేందుకు ఆమె తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. మరోవైపు క్యాసినోలు, జూదం, వ్యాపారాల నిర్వహణతో ఫెమా ఉల్లంఘనలకు పాల్పడ్డాడని ఈడీ దాడులు ఎదుర్కొన్న చీకోటి ప్రవీణ్ కుమార్ కూడా తెరపైకి వచ్చారు. ఆ వివాదాల తర్వాత బీజేపీ పార్టీలో అధికారికంగా చేరి పలు సేవా కార్యక్రమాలలో చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక నుండి పోటీ చేసేందుకు ఆయన కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ గమనిస్తే బీజేపీలో టికెట్ రేసు రసవత్తరంగా మారుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. ఒకవైపు సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి తన పట్టు నిలబెట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మరోవైపు దూకుడుగా ఉండే కొంపెల్లి మాధవీలత లాంటి ప్రముఖులు అసెంబ్లీ వైపు అడుగులు వేస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో దూసుకుపోతున్న చీకోటి ప్రవీణ్ లాంటి వారు కూడా టికెట్ రేసులో నిలబడాలని గట్టి పట్టుదలతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ పార్టీ నాయకుడు చివరికి అదృష్టం పరీక్షించుకుంటారనేది ఆసక్తికరంగా ఉంది. ఎన్నికల సంఘం తుది షెడ్యూల్ ప్రకటించిన తర్వాత అభ్యర్థుల పేర్లపై పూర్తి స్పష్టత వస్తుంది. ఓటర్లను ఆకర్షించేందుకు ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో వ్యూహాలు రచిస్తున్నారు. యువతను తమవైపు తిప్పుకోవడానికి సోషల్ మీడియాను విపరీతంగా వాడుకుంటున్నారు. స్థానిక సమస్యలను హైలైట్ చేస్తూ ప్రత్యర్థుల మీద విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ హైఓల్టేజ్ రాజకీయాలతో ఖైరతాబాద్ నియోజకవర్గం వేడెక్కిపోయింది. ఈ ఉప ఎన్నికల ఫలితాలు రాబోయే సాధారణ ఎన్నికలకు కూడా దిశ నిర్దేశం చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ తమ పట్టును నిలుపుకోవాలని సర్వవిధాలా ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ కూడా కోర్టు తీర్పుల ఆధారంగా తదుపరి వ్యూహం రచిస్తోంది. బీజేపీ మాత్రం ఈ అవకాశాన్ని ఏమాత్రం వదులుకోకుండా గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఏ నేతకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. సోషల్ మీడియాలో మాత్రం ఎవరికి వారు తమ అభిమాన నేతల గురించి జోరుగా ప్రచారాలు చేసుకుంటున్నారు. ఈ ట్రెండ్‌ను బట్టి చూస్తే రాబోయే రోజుల్లో రాజకీయం మరింత రంజుగా మారుతుందని చెప్పవచ్చు. యువత ఓట్లు ఎటువైపు పడతాయనేది ఎన్నికల ఫలితాలను శాసించే కీలక అంశంగా మారుతుంది. అభ్యర్థుల ఎంపికలో ఏ పార్టీ ఏక పక్ష నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఈ ఉత్కంఠకు తెరపడాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# బస్సు బోల్తా.. ఐదుగురు దుర్మరణం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం జరిగిన ఘోర బస్సు ప్రమాదం అత్యంత దిగ్భ్రాంతికరం. శంకర్‌పల్లి మండలం కేసారం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ధారూర్ మండలం చింతకుంట గ్రామానికి ప్రైవేటు బస్సులో బయలుదేరారు. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న నారాయణ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బస్సులో మొత్తం యాభై నాలుగు మంది ప్రయాణికులు ఎక్కారు. ఉదయం సమయంలో ప్రయాణం సాగుతున్న తరుణంలో అనంతగిరి ఘాట్ రోడ్డులోని మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో నలుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మొత్తం ఐదుగురు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం అలుముకుంది. బస్సు బోల్తా పడిన శబ్దాలు విన్న స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన మరో పదిహేను మంది బాధితులను రక్షించి అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని పెద్ద ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత కారణంగా మృతుల కుటుంబాలు తీవ్రమైన శోకసంద్రంలో మునిగిపోయాయి. మృతి చెందిన వారిలో ప్రమీల వయస్సు యాభై రెండు సంవత్సరాలు కాగా, యాదమ్మ వయస్సు కూడా యాభై రెండు సంవత్సరాలుగా అధికారులు గుర్తించారు. అలాగే మాల పద్మ వయస్సు యాభై సంవత్సరాలు కాగా, పద్మమ్మ వయస్సు యాభై ఐదు సంవత్సరాలుగా స్పష్టం చేశారు. మరో మృతురాలి వివరాలు ఇంకా పూర్తిగా వెల్లడి కావాల్సి ఉంది. బస్సులో ప్రయాణిస్తున్న మిగతా వ్యక్తులకు కూడా స్వల్పంగా గాయాలయ్యాయి. ప్రయాణికుల రోదనలతో ఆ ప్రాంతం మొత్తం హృదయవిదారకరంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేశారు. క్రేన్ల సహాయంతో బోల్తా పడిన బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇలాంటి ప్రదేశాలలో వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఘాట్ రోడ్డులోని నిటారువైన మలుపులు, వేగంగా వెళ్లడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని ప్రాథమిక విచారణలో తేలింది. రవాణా శాఖ అధికారులు కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించి బస్సు ఫిట్‌నెస్‌పై విచారణ ప్రారంభించారు. ప్రయాణికుల భద్రతను విస్మరించడం వలనే ఇలాంటి ప్రాణ నష్టాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర రోడ్డు ప్రమాద వార్త తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తక్షణ సాయం ప్రకటించారు. గాయపడిన క్షతగాత్రులందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్యం అందేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం, పది మందికి పైగా గాయపడటం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులను ఆయన కోరారు. గాయపడిన క్షతగాత్రులను వెంటనే రక్షించి అవసరమైన అన్ని రకాల సహాయక చర్యల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నాయకుల స్పందనతో అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమై సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసింది. అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రయాణం ఎప్పుడూ ప్రమాదకరంగానే ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఉన్న మలుపుల వద్ద అనేకసార్లు ఇంతకుముందు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా ప్రైవేటు వాహనాలు వేగంగా వెళ్లడం వల్లనే డ్రైవర్లు అదుపుతప్పుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం కూడా మరో ప్రధాన కారణం. ఈ ప్రమాద సమయంలో కూడా బస్సులో యాభై నాలుగు మంది ప్రయాణికులు ఉండటం గమనార్హం. ఘాట్ రోడ్డు ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి లేదా ఉదయం పూట పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో డ్రైవర్లు లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణించాలి. రోడ్డు రవాణా శాఖ అధికారులు ఘాట్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి వేగాన్ని నియంత్రించాలి. ప్రమాదాలు జరిగే సమయానికి స్పందించేందుకు అక్కడ ఎలాంటి అత్యవసర వైద్య శిబిరాలు అందుబాటులో లేవు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు ఈ మార్గంలోని ప్రమాదాల గురించి సరైన అవగాహన ఉండాలి. రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు చేస్తేనే భవిష్యత్తులో ఇలాంటి ప్రాణ నష్టాలను నివారించడం సాధ్యమవుతుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. హైదరాబాద్ తరలించిన ఇద్దరు బాధితుల ఆరోగ్యం నిలకడగా మార్చేందుకు వైద్యులు నిరంతరం శ్రమిస్తున్నారు. బస్సు యజమాని నిర్లక్ష్యంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు వెల్లడించారు. బస్సు పర్మిట్, ఇన్సూరెన్స్ పత్రాలను రవాణా శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం త్వరలోనే అందిస్తామని స్థానిక మంత్రులు ప్రకటించారు. ఈ ఘటనతో కేసారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలకు వెళ్లాల్సిన వారు అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోవడం ఆ గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం మొత్తం కన్నీటి సంద్రంగా మారింది. ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు కొద్దిగా ఊరట చెందారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలు మరోసారి జరగకుండా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తీరును బట్టి చూస్తే ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు ఎంత అవసరమో స్పష్టంగా అర్థమవుతుంది. పర్వత ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు బస్సు డ్రైవర్లు మద్యం సేవించి ఉన్నారా లేదా అని తనిఖీ చేయాలి. పోలీసులు ఎప్పటికప్పుడు వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేస్తే ఇలాంటి పెను ప్రమాదాలను ముందే అడ్డుకోవచ్చు. అనంతగిరి ఘాట్ రోడ్డులో ఇప్పటివరకు పదికి పైగా పెద్ద ప్రమాదాలు జరిగాయని స్థానిక రికార్డులు చెబుతున్నాయి. ప్రతిసారీ ప్రమాదం జరిగినప్పుడే స్పందించే యంత్రాంగం, ఆ తర్వాత ఆ విషయాలను మరచిపోతుంది. శాశ్వత ప్రాతిపదికన ఘాట్ రోడ్డులో ప్రమాదాలను నివారించడానికి ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు తీసుకోవాలి. ప్రమాదకర మలుపుల వద్ద రిఫ్లెక్టర్లను, సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం అత్యవసరం. రాత్రి సమయాల్లో ఘాట్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడం చాలా మంచిది. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, రవాణా అధికారులపై పూర్తిగా ఉంటుంది. ఈ ఘోర ప్రమాదం మన వ్యవస్థకు ఒక కనువిప్పు కావాలని అందరూ కోరుకుంటున్నారు.

## మొరాయించిన మెట్రో ఎస్కలేటర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పాలనలో ప్రజా రవాణా వ్యవస్థల నిర్వహణ ఏ స్థాయిలో దిగజారిందో చెప్పడానికి బేగంపేట్ మెట్రో స్టేషన్ లో శనివారం చోటుచేసుకున్న ఘటనే ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. కామన్ మొబిలిటీ కార్డ్ పనితీరును స్వయంగా పరిశీలించేందుకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులకు మెట్రో స్టేషన్‌లో చేదు అనుభవం ఎదురైంది. మంత్రులు స్టేషన్‌కు చేరుకుని ప్లాట్ ఫారమ్‌పైకి వెళ్తున్న సమయంలో ఎసలేటర్ అకస్మాత్తుగా ఆగిపోయి మొండికేసింది. దీంతో వేరే దారి లేక మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆగిపోయిన ఎసలేటర్ మెట్లను నడుచుకుంటూనే ఎకాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'శుభమా అని పెళ్లికి పోతుంటే పిల్లి ఎదురొచ్చినట్లు'.. కామన్ మొబిలిటీ కార్డు పనితీరును పరిశీలించేందుకు వచ్చిన మంత్రుల పర్యటనకు ఈ నిర్వహణ లోపం చెడు శకునంగా మారిందని ప్రయాణికులు నవ్వుకుంటున్నారు. మెట్రో నిర్వహణ విషయంలో ఎల్అండ్‌టీతోపాటు, మెట్రో రైలు సంస్థ నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిటీ శాపంగా మారింది. నిత్యం నిలిచిపోయే సేవలతో మెట్రో ప్రయాణమే అధ్వానంగా మారింది. పేరుకు లగ్జరీ ప్రయాణమే అయినా.. పరిస్థితులు అందుకు భిన్నంగా మారిపోయింది. ముఖ్యంగా గడిచిన రెండేళ్లుగా మెట్రో పేరిట కాంగ్రెస్ సర్కారు చేసిన ప్రచారాల డొల్లతనం తాజా ఘటనతో మరోసారి తేటతెల్లమైనట్లుగా నిలిచింది.

# మద్యం మత్తులో తెలంగాణ పల్లెలు

**మొదటిపేజీ తరువాయి**

అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పురుషులలో నూటికి 43 మంది అంటే సుమారు నలభై మూడు శాతానికి పైగా మద్యం సేవిస్తున్నట్లు వెల్లడైంది. ఈ సగటు గ్రామీణ ప్రాంతాల్లో పరిశీలిస్తే ఏకంగా నూటికి 49 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాలలో మాత్రం 33 శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో ఇదే వయస్సు కలిగిన పురుషులలో కేవలం 18 శాతానికి పైగా మాత్రమే మందు తాగుతున్నట్లు తేలింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం తర్వాత దేశంలోనే అత్యధికంగా మద్యం సేవించే పురుషులు ఉన్న జాబితాలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. పల్లెల్లో పెరుగుతున్న ఈ తాగుబోతుల సంఖ్య చూసి నిపుణులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే ఈ వ్యసనానికి బానిస అవుతున్న యువతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ డేటా చూసిన తర్వాత ప్రభుత్వాలు మరింత అప్రమత్తమై నిరోధక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం గ్రామాల్లో మద్యం లభ్యత చాలా తక్కువగా ఉండేదని ఎఫ్‌జీజీ గుర్తు చేసింది. ఆ కాలంలో కేవలం మండల కేంద్రాలకే అమ్మకాలు పరిమితమయ్యేవి. కానీ కాలక్రమేణా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. గ్రామాల్లో బెల్ట్ షాపుల విస్తరణ విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల మద్యం నేరుగా నివాస ప్రాంతాలకూ ఇంటి గడపగడపకూ అందుబాటులోకి వచ్చింది. బెల్ట్ షాపులే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం భారీగా పెరగడానికి ప్రధాన కారణమని ఆ సంస్థ విశ్లేషించింది. కేవలం సర్వే గణాంకాలు మాత్రమే కాకుండా గ్రామాల్లో మందు సులభంగా దొరకడం పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కోలుకోలేని తీవ్ర ప్రభావం చూపుతోంది. సంపాదించిన డబ్బు మొత్తం మందుకే ఖర్చు చేస్తుండటంతో ఇళ్లలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. మహిళలు పిల్లలు పడుతున్న నష్టాన్ని ఎవరూ తీర్చలేరు. ఈ పరిస్థితులు మారాలంటే గ్రామాల్లో అక్రమ వ్యాపారాన్ని పూర్తిగా తరిమికొట్టాలి. అప్పుడే పల్లెలు ప్రశాంతంగా ఉంటాయి. పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోవడానికి ఈ బెల్ట్ షాపుల సంస్కృతి ముఖ్య కారణం అవుతోంది. కూలీ పనులు చేసుకుని బతికే నిరుపేదలు సంపాదించిన ప్రతి రూపాయిని సాయంత్రం కాగానే మందు కోసం తగలేస్తున్నారు. దీనివల్ల పిల్లల చదువులు ఆగిపోతున్నాయి. సరైన వైద్యం అందక అనారోగ్యాల పాలవుతున్నారు. ఇళ్లలో పూట గడవని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు సైతం ఈ మద్యం వల్ల నేరుగా వైశాల్యానికి చేరకుండా పోతున్నాయి. పురుషులు అనారోగ్యంతో త్వరగా మరణిస్తుండటంతో ఎంతోమంది మహిళలు చిన్న వయసులోనే విధవలుగా మారుతున్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ సామాజిక అనర్థాన్ని అరికట్టడానికి అధికారులు ఇప్పటికైనా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. చట్టాలను ఉల్లంఘించి బెల్ట్ షాపులు నడిపే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల బెడదను పూర్తిగా అణచివేయడానికి రాజకీయ నాయకుల ఇచ్ఛాశక్తి చాలా అవసరం. ఎందుకంటే చాలా చోట్ల అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ అనధికారిక వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం సిండికేట్లు గ్రామాల్లోని చిన్న కిరాణా దుకాణాల ద్వారా కూడా మందు బాటిళ్లను విక్రయిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ఈ అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం రావాల్సింది పోయి అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోంది. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ దుస్థితి మారాలంటే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. తప్పు చేసిన వారిపై శాఖాపరమైన వేటు వేయాలి. గ్రామాల్లో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసి బెల్ట్ షాపులపై యుద్ధం ప్రకటించాలి. అప్పుడే తెలంగాణ పల్లెలు మందు మురికి నుంచి బయటపడి అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి అవకాశం ఉంటుంది. తెలంగాణ సమాజం నూతన సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ నివేదిక రాష్ట్ర పరువును దిగజార్చే విధంగా ఉంది. యువతను బంగారు బాటలో నడిపించాల్సిన ప్రభుత్వాలు మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంపై దృష్టి పెట్టడం సరికాదు. సంక్షేమం ముసుగులో పేదల నుంచి మద్యం రూపంలో డబ్బులు గుంజుకోవడం దుర్మార్గం. సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించాలి.

# 'తొలిమెట్టు'పై కలెక్టర్ సీరియస్

- ప్రాథమిక విద్యలో ప్రమాణాలు పెంచాలి
- 5వ తరగతి నాటికి చదవడం, రాయడం
- ప్రాథమిక గణితంపై పట్టు సాధించేలా చర్యలు
- బేస్‌లైన్ టెస్ట్‌లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- పాఠశాలల్లో మౌలిక వసతుల లోపాలుంటే వెంటనే తన దృష్టికి తేవాలి
- ఉపాధ్యాయుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ
- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన విద్యా పునాది ఏర్పడేలా 'తొలిమెట్టు' (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థిలో చదవడం, రాయడం, ప్రాథమిక గణిత భావనలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖపై సంబంధిత అధికారులతో కలెక్టర్ స్నేహ శబరిష్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యార్థుల అభ్యసన స్థాయిలు, 'తొలిమెట్టు' అమలు, బేస్‌లైన్, మిడ్‌లైన్ పరీక్షల ఫలితాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలపై సమీక్షించారు.

**ఐదో తరగతి నాటికి పట్టు సాధించాలి.**

ఐదో తరగతి పూర్తయ్యే సమయానికి ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవడం, రాయడంతో పాటు ప్రాథమిక కూడికలు, తీసివేతలను సులభంగా చేయగలిగే స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులపై చదువు భారం పడకుండా వర్క్‌బుక్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) కిట్లను వినియోగిస్తూ రంగురంగుల చిత్రాలు, కథలు, ఆట పాటల ద్వారా సృజనాత్మక బోధన అందించాలని అన్నారు.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక నజర్.**

ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు అదనపు సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. బేస్‌లైన్ పరీక్షలో విద్యార్థుల ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ, మిడ్‌లైన్ పరీక్ష నాటికి గణనీయమైన మెరుగుదల కనిపించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

**□జిల్లా ర్యాంకింగ్ మెరుగుదలకు కార్యాచరణ.**

జిల్లా విద్యా ర్యాంకింగ్ మెరుగుపడేందుకు అవసరమైన చర్యలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాఠశాలల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపర్చాలని అన్నారు. ఏ పాఠశాలలోనైనా మౌలిక వసతుల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**నోట్‌బుక్స్, యూనిఫార్మ్స్.. తరగతులు షెడ్యూల్ ప్రకారమే.**

జిల్లాలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫార్మ్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పారిశుద్ధ్యంపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ఉపాధ్యాయుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ.**

విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల హాజరు కూడా వంద శాతం నమోదయ్యేలా ఉన్నతాధికారులు, ప్రోగ్రాం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల పనితీరులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో మానిటరింగ్ పెంచాలని సూచించారు.

**డిజిటల్.. ఏఐ బోధనకు ప్రాధాన్యం.**

విద్యార్థులకు నూతన బోధనా విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని, డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత బోధనా పద్ధతులను వినియోగిస్తూ అత్యుత్తమ విద్యను అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా ప్రమాణాల పెంపుపై అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అందరి భాగస్వామ్యంతోనే 'తొలిమెట్టు' విజయవంతం.**

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేసే 'తొలిమెట్టు' కార్యక్రమం విజయవంతం కావాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచితే భవిష్యత్తులో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.

**సమీక్షలో పాల్గొన్న అధికారులు.**

సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి శ్రీరాములు, కోఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, సురేష్, గాయత్రి, సంతోష్, ఎఫ్ఏఓ శంకర్, సైన్స్ ఆఫీసర్ అప్పారావు, సతీష్, పలు మండలాల మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు మరో ముందడుగు

- జిల్లాలోని ప్రతి ప్రాజెక్టుకు 5 గొడుగుల చొప్పున పంపిణీ
- మహిళలకు అవసరమైన సహాయాన్ని అందించడమే లక్ష్యం
- ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి శిరీష



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో మహిళలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం కార్యాలయంలో గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి శిరీష మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రాజెక్టుకు ఐదు గొడుగుల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారతను ప్రోత్సహించడంతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో మహిళలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మహిళల అవసరాలను గుర్తించి వారికి అందుబాటులో ఉండేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. మహిళా సాధికారత కేంద్రం ద్వారా అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ప్రాజెక్టుకు గొడుగులను అందించడం ద్వారా అవసరమైన మహిళలకు వాటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, సంబంధిత అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అక్టోబర్ 6న ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సును జయప్రదం చేయాలి



**మోటకొండూర్, విశాల భారతి:** విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని స్టూడెంట్ ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని, అక్టోబర్ 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఏమేసేఫ్ జాతీయ విద్యార్థి సదస్సును జయప్రదం చేయాలని ఎం ఆర్ పి ఎస్ మోటకొండూర్ మండల అధ్యక్షుడు కొంపల్లి పరశురాం మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మోటకొండూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎం ఎస్ ఎఫ్ జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యలు, భవిష్యత్తు కోసం విద్యార్థి సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొట్ల నరసింహ మాదిగ, ఎం ఆర్ పి ఎస్ మండల ఇన్‌చార్జి ఆడెపు శ్రీనివాస్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు గంధమల్ల నరసింహ, పట్టణ కార్యదర్శి బొట్ల సురేష్, మండల సహాయ కార్యదర్శి బొట్ల నవీన్ మాదిగ, బొట్ల నరేష్ మాదిగ, వంగపల్లి మొగులయ్య, బొట్ల సాయిల్ మాదిగ, బొట్ల లక్ష్మయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

- కాటేపల్లి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు, అవగాహన కార్యక్రమం



**కాటేపల్లి, విశాల భారతి:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. శనివారం కాటేపల్లి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలతో పాటు రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు తదితర వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, చెల్లుబాటులో ఉన్న బీమా పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణించవద్దని హెచ్చరించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, వారు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని అధికారులు కోరారు.

## కురవి ఎస్సీ వసతి గృహం నూతన భవనంలోకి మార్పు

- ఎమ్మెల్యే రామచంద్రనాయక్ చిత్రపటానికి దళిత సంఘాల పాలాభిషేకం.



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మండల కేంద్రంలోని పాత ఎస్సీ బాలికల వసతి గృహాన్ని నూతనంగా నిర్మించిన భవనంలోకి తరలించేందుకు ప్రత్యేక చొరవ చూపిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్‌కు దళిత సంఘాల నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కురవి మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పాత వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులు, భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని నూతన భవనంలోకి తరలించాలని దళిత నాయకులు చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. విద్యార్థుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నూతన భవనంలోకి హాస్టల్‌ను మార్చేందుకు ఆయన చూపిన కృషి అభినందనీయమని నాయకులు కొనియాడారు. నూతన భవనంలో విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు సురక్షితమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, దళితరత్న దైద భద్రయ్య (కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు), సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత కిన్నెర మల్లయ్య, మాజీ వార్డు సభ్యులు ఇరుగు వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, హమాలీ సంఘం అధ్యక్షుడు పిలిమర్తి రమణయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దైద నితిన్, చింటూ, సందీప్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్న రవినాయక్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** కురవి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ నాయకులు గుగులోతు రవినాయక్ పట్టభద్రులతో కలసి ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం దరఖాస్తు (ఫామ్ 18) అందజేశారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. కురవి మండల పరిధిలోని గ్రాడ్యుయేట్లు ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటు హక్కును పొందేందుకు తహసిల్దార్ కార్యాలయంలో నేరుగా ఆఫ్ లైన్ ద్వారా గాని, ఆన్ లైన్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన పట్టభద్రులందరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 2023 కంటే ముందు డిగ్రీ, తత్సమాన డిప్లమా లేదా ఓపెన్ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని గ్రాడ్యుయేట్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు గుగులోతు వెంకటేష్, బానోత్ వాసు తదితరులు పాల్గొని తమ దరఖాస్తులను సమర్పించారు.

## SIR పేరుతో ఓటర్ల తొలగింపును ఆపాలి

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- రాజీనామా చేయాలి: బేజాడి కుమార్



**ఆలేరు, విశాల భారతి:** రాజ్యాంగబద్ధమైన ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారని, దాదాపు 13 కోట్ల ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని బేజాడి కుమార్ అన్నారు. దీనివల్ల అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషన్ కలిసి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు ప్రజాస్వామ్య వ్యవస్థపై అనుమానాలకు తావిస్తున్నాయని ఆయన అన్నారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన అధికార వ్యవస్థలు, ఎన్నికల కమిషన్ తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని బేజాడి కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య మనుగడను, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## యాసంగిలో పప్పు ధాన్యాల సాగు చేయాలి

- వరి సాగుకు దూరంగా ఉండాలి
- ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి





**డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున యాసంగి సీజన్‌లో రైతులు పప్పు ధాన్య పంటలను సాగు చేయాలని ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డోర్నకల్ మండలం చిలుకొడు రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగాన్ని రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, జలాశయాల్లోకి నీటి రాక తగ్గడం, బోర్లు, బావులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితుల్లో యాసంగి సాగుపై రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులను దృష్టిలో పెట్టుకుని యాసంగిలో ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయకూడదని ఆయన అన్నారు. ఒక ఎకరా వరి పంటకు అవసరమయ్యే నీటితో రెండు నుంచి మూడు ఎకరాల వరకు పప్పు ధాన్యాల పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచనలను రైతులు విధిగా పాటించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకు రావాలని కోరారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో తన పేరు నమోదు చేసుకోవాలని నల్లు సుధాకర్‌రెడ్డి సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ లేకుంటే పండించిన పంటను విక్రయించుకోవడంతో పాటు పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు, యూరియా సరఫరా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు వెంటనే సంబంధిత ఏఈఓలను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పంటల సాగులో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి అనిల్, సెరికల్చర్ అధికారి సురేష్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గమే శరణ్యం



- మానవతాశిఖరం మహాత్మా గాంధీ
- యువతకు సరైన మార్గనిర్దేశం అవసరం
- వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేసిన అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలే మానవాళికి శరణ్యమని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న హింస, తగాదాలు, వర్గపోరాటాలు, కుల, మత వైరాలు, అల్లర్లు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే గాంధీజీ ఆలోచనా విధానాలను ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రపంచశాంతి గాంధీ మార్గం' అంశంపై వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో విజేతలైన విద్యార్థులకు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక జీవన విధానానికి అలవాటు పడుతున్న మనిషి చిన్న సమస్యలకే కుంగిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. జీవన పోరాటంలో విసిగిపోయి కొందరు హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సంపూర్ణ ఎదుగుదల, వికాసంతో పరిణతి చెందిన మనస్తత్వం కలిగిన యువతగా ఎదగడానికి కౌమార దశ నుంచే సరైన మార్గనిర్దేశం అవసరమన్నారు. ఆ దశలో సరైన అవగాహన, దిశానిర్దేశం లేకపోవడం అనేక సమస్యలకు కారణమవుతోందని తెలిపారు. నేడు ఎక్కడ చూసినా తగాదాలు, కొట్లాటలు, వర్గపోరాటాలు, కులపోరాటాలు, జాతి వైరాలు, మతకలహాలు, అల్లర్లు, అరాచకం, రక్తపాతం, అమానుషాలు పెరుగుతున్నాయని అదనపు కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మనిషి తన ఆలోచనా విధానాన్ని పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన పురాతన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల్లోని మానవతా స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ సమాజాన్ని శాంతి మార్గంలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలే మానవాళికి శరణ్యమని, గాంధీజీ మానవతాశిఖరమని పేర్కొన్నారు. గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 2 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గాంధీజీ మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి లోకానికి గాంధీజీ ఆలోచనలను పరిచయం చేస్తూ వాటిపై విస్తృత ప్రచారం చేస్తున్నామని చెప్పారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని 'ప్రపంచశాంతి-గాంధీ మార్గం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మోత్కూరు వెంకటేశ్వర్లు, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ వంగ సురేష్, గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి వెంగంటి శుభ, వివిధ విద్యాసంస్థలకు చెందిన విజేత విద్యార్థులు సుప్రియ, అక్షర, యశ్వంత్, వరుణ్ చారి, మదిహ, చందు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



**ఆలేరు, విశాల భారతి:** పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆలేరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నిద్రిస్తున్న సమయంలోనే పారిశుద్ధ్య కార్మికులు విధుల్లోకి దిగి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. వారి సేవలు లేకుండా ప్రజారోగ్య వ్యవస్థ ముందుకు సాగదన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికులను అప్పట్లో ప్రశంసించిన పాలకులు, ప్రస్తుతం వారి సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ వేతనాలతో పనిచేయాల్సి రావడం అన్యాయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు రక్షణ పరికరాలు, ఆరోగ్య భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వంగపల్లి శ్రీనివాస్ మాదిగ హెచ్చరించారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కందుల రామన్ మాదిగ, రాజాపేట మండల అధ్యక్షుడు దగ్గుల విష్ణు మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు అందే సుధాకర్, మండల నాయకుడు రాంచర్ల సిద్ధులు, బోడ నరేష్, కందుల మధు, వంగపల్లి శ్రీకాంత్, గౌతమ్ రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లీన్ అండ్ గ్రీన్‌గా ఒకటో వార్డు అభివృద్ధే లక్ష్యం

- కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్





**ఆలేరు, విశాల భారతి:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డును పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడమే తన ధ్యేయమని వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ తెలిపారు. వార్డు పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి దొంతిరి ఫంక్షన్ హాల్ వరకు రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన మట్టి, ఇసుకను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేసి తొలగించారు. చేపట్టిన పారిశుధ్య పనులను కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రహదారిపై మట్టి, ఇసుక పేరుకుపోవడంతో వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా వాటిని తొలగించినట్లు పేర్కొన్నారు. వార్డులో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు వాయిదా వేయడం సరికాదు

- టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** అధ్యయన కమిటీల పేరుతో సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దును వాయిదా వేయడం ఎంతమాత్రం సరికాదని, ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల శాఖ అధ్యక్షుడు గుండ్ల విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల సేకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమేనని విమర్శించారు. అలాగే వేతన సవరణ కమిటీ (పీఆర్సీ)ని నియమించి మూడు సంవత్సరాలు గడిచినా, ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో 'నివేదిక త్వరలోనే సమర్పిస్తాం' అని చెప్పి ప్రభుత్వం మాట దాటవేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, పీఆర్సీ నివేదికను ఆమోదించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, జిల్లా బాధ్యులు బొల్లం శ్రీనివాస్, గోనె కార్తిక్, ముస్తఫా, పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

- 5న భువనగిరిలో సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ
- ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా



**ఆలేరు, విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులకు రోజుకు 16 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు భువనగిరి పట్టణంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొనాలని, ప్రతి మండలం నుంచి 20 మంది చొప్పున కార్యకర్తలను తరలించాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చౌడబోయిన కనకయ్య, మండల కార్యదర్శి మాదర్ జానమ్మ, ప్రవీణ్, రవి, రాజు, ఆంజనేయులు, పరశురాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గ్రాడ్యుయేట్లు తమ ఓటుతో సమాధానం చెప్పాలి

- ఇప్ప పృథ్వి రెడ్డి



**దేవరుప్పుల విశాల భారతి ;** అర్హత కలిగిన పట్టభద్రులు వెంటనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నేత ఇప్ప పృథ్వి రెడ్డి పిలుపునిచ్చారు.అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని,నిరుద్యోగ భృతి అందిస్తామని నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిరుద్యోగ యువత భవిష్యత్తుకు,పట్టభద్రుల ఆకాంక్షలకు సంబంధించిన ప్రజా తీర్పు అని,తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం పట్టభద్రులకు ఉందని,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అత్యంత ముఖ్యమని,అర్హత కలిగిన పట్టభద్రులు చివరి తేదీ నవంబర్ 6 లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

# ప్రమాదకర సీకులను స్వయంగా తొలగించిన ఉపసర్పంచ్ స్థానికుల ప్రశంసలు



**చౌటుప్పల్,విశాల భారతి:** ప్రజా సమస్యను గుర్తించి అధికారుల కోసం ఎదురుచూడకుండా స్వయంగా పరిష్కరించిన చిన్నకొండూరు ఉపసర్పంచ్ గడ్డం సత్తయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు. చిన్నకొండూరు నుంచి పెద్దకొండూరు వెళ్లే దారిలోని బ్రిడ్జి వద్ద ఇనుప సీకులు పైకి తేలి ఉండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉండటాన్ని గమనించిన ఉపసర్పంచ్ గడ్డం సత్తయ్య వెంటనే స్పందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకుని పైకి తేలిన సీకులను స్వయంగా తొలగించి రహదారిని ప్రమాదరహితంగా మార్చారు. దీంతో వాహనదారులకు ఇబ్బంది తొలగిపోయింది. ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలపై తక్షణమే స్పందిస్తూ పదవిని బాధ్యతగా నిర్వహిస్తున్న గడ్డం సత్తయ్య చొరవ అభినందనీయమని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

# ఇందస్ వ్యాలీ కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ – అధికారులకు తక్షణ చర్యల ఆదేశాలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** 123వ డివిజన్ పరిధిలోని ఇందస్ వ్యాలీ కాలనీలో తాగునీరు, డ్రైనేజీ లైన్ల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. కాలనీలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా డ్రైనేజీ లైన్లు లేకపోవడం వల్ల మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వర్షాలు కురిసిన సమయంలో స్థానికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు, పనుల వివరాలను పరిశీలించి త్వరలోనే కార్యాచరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన కాలనీ ప్రతినిధులకు స్థానికులు అభినందనలు తెలిపారు. సమస్యపై స్పందించి అధికారులకు తగిన సూచనలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు కాలనీ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారానికి సహకరించిన సాగర్ గౌడ్ కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందస్ వ్యాలీ కాలనీ అధ్యక్షుడు అరవింద్ గౌడ్, ఏసీఎఫ్ అధ్యక్షుడు వినయ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కాలనీ పెద్దలు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అధికారులే వారధి

- సమస్యలు గుర్తించాలి పరిష్కారానికి కృషిచేయాలి
- మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వపథకాలు నేరుగా జలకు చేరాలి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష
- ఒక్కో గ్రామానికి సుమారుగా రూ.3కోట్లకు పైగా నిధులిచ్చామన్న ఎమ్మెల్యే
- మంచాల మండల రూపురేఖలు మార్చటమే లక్ష్యమని వెల్లడి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** ప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు చేరినప్పుడే సర్కార్ లక్ష్యం నెరవేరుతుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అధికారులు వారధిగా పనిచేయాలన్నారు. శనివారం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, సంక్షేమ పథకాల అమలు తీరును సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. అధికారులు హెడ్‌క్వార్టర్‌ను వదిలి, ప్రజల వద్దకు వెళ్తేనే సమస్యలు తెలుస్తాయన్నారు. ఆఫీస్‌కు వచ్చామా వెళ్లిపోయామా అన్నట్టుగా విధి నిర్వహణ ఉండకూడదని ఎమ్మెల్యే తెలిపారు.

**పంచాయతీ కార్యదర్శులే కీలకం**

గ్రామాల అభివృద్ధి, పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముందుకెళ్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో ఉండే పంచాయతీ కార్యదర్శులే కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో సమస్యను గుర్తించి, సంబంధితశాఖాధికారికి సమాచారమివ్వాలని చెప్పారు. ప్రతీరోజూ ఏయే అధికారి గ్రామంలో పర్యటిస్తున్నారనేది గ్రామపంచాయతీలో రికార్డు మెయిన్‌టెయిన్ చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్లు పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలును నిత్యం పర్యవేక్షించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జీపీవోలతో సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సెక్రటరీలు ముందుండి పనిచేయాలన్నారు.

**రూపురేఖలు మార్చుదాం**

వెనకబడిన ప్రాంతంగా పిలిచే ఈ మండలంలో అత్యున్నత ప్రమాణాలతో ఆరుట్ల టీపీఎస్ ఏర్పాటు చేసి, రాష్ట్రానికే దిక్సూచీగా నిలబెట్టామన్న మల్‌రెడ్డి.మంచాలకు మరో విద్యాకేంద్రం తెస్తామన్నారు. ఇప్పటి వరకు రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు మండలానికి రూ.66కోట్ల నిధులిచ్చామని ఒక్కో గ్రామానికి సుమారుగా మూడు కోట్లు అందినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంచాల మండల రూపురేఖలు మార్చేందుకు చేసే ప్రయత్నంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సరఫరా పట్ల ప్రత్యేకంగా ఆరాతీసిన ఎమ్మెల్యే కరెంటు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసంతలక్ష్మి, కోపరేట్ బ్యాంకు చైర్మన్ వెదిరే హనుమంత రెడ్డి మార్కెట్ చైర్మన్ గురునాథరెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుసుమ సాగుకు సర్కారు ప్రోత్సాహం

- 20 ఎకరాల్లో క్షేత్ర ప్రదర్శనకు విత్తనాల పంపిణీ
- నూనెగింజల సాగు వైపు రైతులను మళ్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** నూనెగింజల పంటల సాగును విస్తరించడంతో పాటు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించే దిశగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మహబూబాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు కుసుమ విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ చేతుల మీదుగా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 20 ఎకరాల విస్తీర్ణంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించేందుకు కుసుమ (Safflower) విత్తనాలను రైతులకు అందజేశారు.

**నూనెగింజల సాగుకు ఊతం.**

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-2026 పథకం కింద నూనెగింజల పంటల సాగు, ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయచంద్ర తెలిపారు. రైతులను నూనెగింజల సాగు వైపు ప్రోత్సహించడం, పంటల విస్తీర్ణాన్ని పెంచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

**క్షేత్ర ప్రదర్శనతో అవగాహన.**

రైతులకు కుసుమ సాగుపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు 20 ఎకరాల్లో క్షేత్ర ప్రదర్శన చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పంట సాగు విధానం, ఉత్పాదకత, నూనెగింజల పంటల ప్రాధాన్యతను రైతులకు వివరించనున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

**అధికారులు, రైతుల హాజరు.**

కార్యక్రమంలో మహబూబాబాద్ డివిజన్ ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఎన్. తిరుపతిరెడ్డి, ఏఈఓలు పున్నమి, వినుషా, ఏవో (టెక్నికల్) బి. రాంజీతో పాటు రైతులు బావసింగ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచుల చెక్ పవర్‌పై ఆంక్షలు ఎత్తివేయాలి

- జాయింట్ చెక్ పవర్‌ను యథాతథంగా కొనసాగించాలి..
- ఉపసర్పంచులకు గౌరవ వేతనం రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలి:
- జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి డిమాండ్



**చౌటుప్పల్,విశాల భారతి:** గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత కోసం ఉపసర్పంచులకు కల్పించిన జాయింట్ చెక్ పవర్‌పై ప్రభుత్వం విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు,మందోళ్ల గూడెం గ్రామ ఉపసర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని సర్పంచులు, ఉపసర్పంచులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తారనే కారణంతో వారి మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఉపసర్పంచుల జాయింట్ చెక్ పవర్‌ను తొలగించాలనే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ఉపసర్పంచులు చెక్కులపై నిర్ణీత సమయంలో సంతకం చేయాలంటూ విధించిన ఆంక్షలు పంచాయతీల్లో పారదర్శకతకు విరుద్ధంగా మారే అవకాశం ఉందని శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. అవినీతిని అరికట్టేందుకు ఉద్దేశించిన జాయింట్ చెక్ పవర్‌ను బలహీనపరిచే చర్యలు కాకుండా, మరింత పారదర్శకంగా వ్యవహరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. 2018లో అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్ చట్టం ద్వారా సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్ కల్పించారని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఉపసర్పంచులకు కల్పించిన ఈ అధికారాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఎవరైనా ఉపసర్పంచ్ సరైన కారణం లేకుండా చెక్కుపై సంతకం చేయకపోతే, ఆ అంశంపై సంబంధిత అధికారులు విచారణ నిర్వహించి తప్పు చేసిన వ్యక్తిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. కానీ ఒకరిద్దరి విషయంలో తలెత్తే సమస్యలను కారణంగా చూపుతూ రాష్ట్రంలోని ఉపసర్పంచులందరి పై ఆంక్షలు విధించడం సమంజసం కాదని అన్నారు.ఉపసర్పంచుల చెక్ పవర్‌పై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేసేలా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పందించాలని శ్రీధర్ రెడ్డి కోరారు. అలాగే రాష్ట్రంలోని ఉపసర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం అందించాలని తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం తరపున డిమాండ్ చేశారు. ఉపసర్పంచుల హక్కులను పరిరక్షిస్తూ, గ్రామ పంచాయతీల్లో పారదర్శక పాలనకు అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# గ్రామసభలో ఉప సర్పంచ్‌పై చెప్పుతో దాడి ఆరోపణ



- సర్పంచ్‌పై చర్యలు తీసుకుని పదవి నుంచి తొలగించాలి : బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార మల్లేష్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** గాంధీ జయంతి సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో దళిత ఉప సర్పంచ్ కరిమెల నర్సింగ్‌రావుపై చెప్పుతో దాడి జరిగిందంటూ బహుజన సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార మల్లేష్ ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్యార మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కరిమెల నర్సింగ్‌రావును సర్పంచ్ అంతటి హేమలత గౌడ్, అంజయ్య గౌడ్ తదితరులు ప్రశ్నించినట్లు, అనంతరం కులం పేరుతో దూషిస్తూ గల్లా పట్టుకుని చెప్పుతో దాడి చేసినట్లు ఆరోపించారు. నిండు గ్రామసభలో ప్రజల సమక్షంలో ప్రజాప్రతినిధిపై దాడి జరిగిందని ఆరోపించిన గ్యార మల్లేష్.. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ హేమలత గౌడ్‌ను అరెస్ట్ చేసి, సర్పంచ్ పదవి నుంచి తొలగించాలని బహుజన సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఈసీ సభ్యుడు చిత్రం కృష్ణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్, వార్డు సభ్యులు అంతటి బాలకృష్ణ గౌడ్, కరిమెల వెంకటేష్, కరిమెల శ్రీనివాస్, కరిమెల పోచయ్య, కరిమెల రవి, కరిమెల శంకరయ్య, కరిమెల భాస్కర్, చిత్రం బాల్‌రాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వెనుక నుంచి కారు ఢీకొని వ్యక్తి మృతి

- హయత్‌నగర్‌లో ఘటన.. గుర్తుతెలియని కారు కోసం పోలీసుల గాలింపు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-65పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అయ్యప్ప కాలనీకి చెందిన రెగుచింతల బాలరాజు (62) రోడ్డు ప్రమాదానికి బలయ్యాడు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2న రాత్రి 11.10 గంటల సమయంలో బాలరాజు తన నివాసం నుంచి హయత్‌నగర్ బస్‌స్టేషన్ వైపు కాలినడకన వెళ్తుండగా, పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వెనుక నుంచి అతడిని ఢీకొట్టింది. ప్రమాదంలో బాలరాజుకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని కారు, డ్రైవర్‌ను గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు. నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# రెడ్ క్రాస్ ఎన్నికలు తదుపరి ఉత్తర్వుల వరకు వాయిదా

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)చంద్రా రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** రంగారెడ్డి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS) జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వాయిదా వేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి తెలిపారు.

జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేసిన లేఖ నం. H2/741/2026,

తేదీ: 03102026 లోని ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెడ్ క్రాస్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి 04102026న నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియను వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు, తదుపరి ఎన్నికల షెడ్యూల్‌ను సంబంధిత ఆదేశాల అనంతరం ప్రకటిస్తామని తెలిపారు.

# రైలు ఢీకొని 500 గొర్రెల మృతి

- బాధిత గొర్రెల కాపరి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రైలు ఢీకొని సుమారు 500 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. జూలూరు అలీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి కిష్టయ్యకు చెందిన గొర్రెలు బీబీనగర్-ఘట్‌కేసర్ మధ్య కొండమడుగు వద్ద దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గొర్రెల మృతితో తీవ్రంగా నష్టపోయిన కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి కూడా తగిన సహాయం అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ అవకతవకలపై మండిపడ్డ రైతులు యాచారంలో సాగర్ రహదారి పై బైఠాయింపు, స్తంభించిన రాకపోకలు

- ఆర్డీవో కలెక్టర్ స్పష్టమైన సమాధానం ఇచ్చేంతవరకు వదిలేది లేదు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామంలో ఇటీవల చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధిత రైతులు శనివారం తీవ్ర ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 19, 68, 127 లోని భూముల సేకరణలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని, రికార్డుల నమోదులో అక్రమాలకు పాల్పడ్డారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన బాధిత రైతులు, అధికారుల నుండి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళనను తీవ్రతరం చేశారు. అనంతరం నాగార్జునసాగర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై కుటుంబసమేతంగా బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ సర్వే నంబర్లు 19, 68, 127 పరిధిలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు సంబంధించి సరైన పరిహారం చెల్లించకుండా, నోటీసులు లేకుండా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. స్థానిక ఆర్డీవో (RDO), జిల్లా కలెక్టర్ స్వయంగా ఘటనా స్థలానికి వచ్చి తమ సమస్యపై స్పష్టమైన సమాధానం చెప్పే వరకు రహదారిని వదిలిపెట్టేది లేదని భీష్మించుకూర్చున్నారు. రైతుల రాస్తారోకో కారణంతో నాగార్జునసాగర్ హైదరాబాద్ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికార యంత్రాంగం స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డ్ మెంబర్ తాండ్ర రవీందర్, మర్పల్లి అంజయ్య వార్డు మెంబర్లు, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో రూ.2.88 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం

- కొత్వాల్‌గూడ, సంఘీగూడలో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.2.88 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని 118, 119 వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న వరద నీటి కాలువల పనులను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. వార్డు నంబర్ 118లో రాఘవేంద్ర హోటల్ నుంచి సంఘీగూడ జంక్షన్ వరకు, అలాగే వార్డు నంబర్ 119లో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులోని బాక్స్ కల్వర్ట్ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి కొత్వాల్‌గూడలోని ప్లాట్ నంబర్ 114 వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్లను నిర్మించనున్నారు. మొత్తం రూ.288 లక్షల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు.

వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు శ్రీకారం చుట్టారు. డ్రైన్ల నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల్లో వరద నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గనున్నాయి. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సంబంధిత అధికారులను సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కోర్టు ఉత్తర్వుల మేరకే భూ రిజిస్ట్రేషన్ తహసీల్దార్ అయ్యప్ప



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారంటూ వచ్చిన వార్త కేవలం అసత్యమని, న్యాయస్థానాల ఆదేశాల మేరకే పూర్తి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని యాచారం మండల తహసీల్దార్ అయ్యప్ప ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందివనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361/AA, ఖాతా నంబర్ 155లోని 5 ఎకరాల 11 గుంటల భూమికి సంబంధించి ఓ.ఎస్. నంబర్ 547/2021 కేసులో ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 26072022న విక్రయ పత్రం అమలు చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం పిటిషనర్ వేసిన E.P. No. 18/2023 ప్రక్రియలో భాగంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జారీ చేసిన లేఖలు (Dis. No. 167/2025, 168/2025) ప్రకారం కోర్టు రికార్డ్ అసిస్టెంట్ ద్వారా సేల్ డీడ్ నమోదుకు ప్రతిపాదించగా, దీని అమలుపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్ నంబర్ 35037/2025లో 19112025న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. న్యాయస్థానం ఆదేశించిన నిబంధనలు, స్లాట్ బుకింగ్ ఆధారంగానే రిజిస్ట్రేషన్ అధికారి సదరు సేల్ డీడ్‌ను నమోదు చేసి విడుదల చేశారని, ఇందులో తహసీల్దార్ గానీ, రెవెన్యూ సిబ్బంది గానీ రికార్డులను తారుమారు చేయలేదని తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం సరి కాదని అన్నారు.

## యోగాతో ఆరోగ్యకర జీవనం సాధ్యం

- మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు పురస్కారం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హైకోర్టు కాలనీ డివిజన్‌లోని హుడా సాయినగర్‌లో బ్రీత్ ఆఫ్ లైఫ్ యోగా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన తన సతీమణి కళ్లెం నవీనతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించి 'స్పెషల్ రికగ్నిషన్ అవార్డు' అందజేశారు. పురస్కారం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనశైలిలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తనను సత్కరించి ప్రత్యేక గుర్తింపు పురస్కారం అందజేసిన బ్రీత్ ఆఫ్ లైఫ్ యోగా నిర్వాహకులకు కళ్లెం నవజీవన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యోగా నిర్వాహకులు, సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు నిర్ధారణతోనే రొమ్ము క్యాన్సర్‌కు చెక్

- సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన సదస్సు



**సికింద్రాబాద్, విశాల భారతి :** మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు వ్యాధి నిర్ధారణ ప్రాధాన్యతను చాటిచెప్పే లక్ష్యంతో సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో శనివారం 'పింక్ అక్టోబర్' ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేశంలో మహిళలను వేధిస్తున్న క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ మొదటి స్థానంలో ఉందని, ఏటా రెండు లక్షలకు పైగా కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో సమయానికి గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ నివేద్ రావు బల్మూరి మాట్లాడుతూ, 40 ఏళ్లు దాటిన మహిళలు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రొమ్ములో ఏవైనా గడ్డలు, మార్పులు లేదా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 31 వరకు కొనసాగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రిజిస్టర్ చేసుకున్న మహిళలకు ఉచితంగా ఆంకాలజిస్ట్ కన్సల్టేషన్, క్యాన్సర్ రిస్క్ అసెస్మెంట్, కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన వారికి ఉచిత బ్రెస్ట్ అల్ట్రాసౌండ్ (యూఎస్‌జీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక రాయితీ ప్యాకేజీలను ప్రకటించారు. అసలు ధర రూ. 6,500 విలువైన పురుషుల స్క్రీనింగ్ ప్యాకేజీని కేవలం రూ. 1,000కే అందిస్తున్నారు; ఇందులో సీబీపీ, ఈఎస్ఆర్, సీఏ 19.9, పీఎస్ఏ మరియు మెడికల్ ఆంకాలజీ కన్సల్టేషన్ ఉంటాయి. అసలు ధర రూ. 11,000 విలువైన మహిళల సమగ్ర స్క్రీనింగ్ ప్యాకేజీని రూ. 2,000కే అందుబాటులో ఉంచారు; ఇందులో సీబీపీ, ఈఎస్ఆర్, పొత్తికడుపు అల్ట్రాసౌండ్, సోనో మామోగ్రఫీ, సీఏ 125, పాప్ స్మియర్ మరియు గైనకాలజీ కన్సల్టేషన్ సేవలు లభిస్తాయి. మహిళల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలనే పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో సీనియర్ గైనెక్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మాధవి డొక్కు, మెడికల్ అండ్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ నూర్జియా సుల్తానా సయ్యద్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ కె. అభినవ్ కుమార్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఆదరి భార్గవ్, హాస్పిటల్ సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరగకముందే నాలాకు మరమ్మతులు చేపట్టాలి

- బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఈశ్వరి బాయి నగర్ మార్కండేయ టెంపుల్ ఎదురుగా నాలాపై ఉన్న స్లాబ్‌లో ఒక భాగం విరిగిపోవడంతో ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. నాలా స్లాబ్ మరింత దెబ్బతిని కూలిపోయే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, మాజీ వార్డు మెంబర్ మంద జగన్ అక్కడికి చేరుకొని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ..... ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, తులసి, కవిత, పావని, నిమిత, ప్రశాంత్, వనజ, సునిత, ధనమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు దాటుతుండగా వృద్ధుడిని ఢీకొట్టిన బైక్.. ఆపై కారు తొక్కేయడంతో మృతి

- హయత్‌నగర్ కృష్ణవేణి ఆస్పత్రి సమీపంలో ఘటన
- ఇద్దరు వాహనదారుల కోసం పోలీసుల గాలింపు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రోడ్డు దాటుతున్న వృద్ధుడిని వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో కిందపడిపోగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని ఎర్టిగా కారు అతడిపై నుంచి దూసుకెళ్లిన ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణవేణి ఆస్పత్రి సమీపంలో అక్టోబర్ 2న సాయంత్రం చోటుచేసుకుంది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ రాక్‌టౌన్ కాలనీకి చెందిన మేక రవీందర్‌రెడ్డి (66) రోడ్డు దాటుతుండగా పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్న హోండా షైన్ బైక్ (TG13BA8244) అతడిని ఢీకొట్టింది. బైక్‌ను డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బైక్ ఢీకొనడంతో రవీందర్‌రెడ్డి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని ఎర్టిగా కారు కూడా వేగంగా వచ్చి రోడ్డుపై పడిపోయిన రవీందర్‌రెడ్డిపై నుంచి దూసుకెళ్లింది. సుమారు ఐదు మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు క్షతగాత్రుడిని హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవీందర్‌రెడ్డి మృతి చెందారు. ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన హోండా షైన్ బైక్ డ్రైవర్‌తో పాటు గుర్తుతెలియని ఎర్టిగా కారు డ్రైవర్‌ను గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు. నిందితులను గుర్తించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## ఆరోగ్యకర ఎదుగుదలకు బాట

- నిరంతర పర్యవేక్షణతో మరింత ప్రయోజనం
- పోషకాహారంతో పాటు పాఠశాల సంసిద్ధత
- సర్పంచులు బానోతు బద్రీ నాయక్ జాటోతు హ



**డోర్నకల్ విశాల భారతి:** ఐదేళ్లలోపు చిన్నారుల పోషకాహార స్థాయిని మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉమ్మడి ఆనేపురం గ్రామపంచాయతీ ఎలమంచిలి తండ, కూడియా తండ లో ప్రారంభమైంది.గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ బానోతు బద్రు నాయక్, హమ్మి చిన్నారులకు అల్పాహారాన్ని అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో పోషకాహారం కీలకపాత్ర పోషిస్తుంది. ఉదయం పూట పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లల్లో శక్తి, చురుకుదనం పెరగడంతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సమతుల ఆహారం అందించడంలో ఈ కార్యక్రమం ఉపయోగకరంగా మారనుంది.

**పోషకాహారంతో పాటు పాఠశాల సంసిద్ధత**

అంగన్వాడీ కేంద్రాల్లో అల్పాహారం అందించడం కేవలం ఆకలి తీర్చే కార్యక్రమంగా కాకుండా.. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రీస్కూల్ అభ్యసనను అనుసంధానించే చర్యగా భావించవచ్చు. ఉదయం అల్పాహారం తీసుకున్న చిన్నారులు ఆటలు, పాటలు, విద్యా సంబంధిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంటుంది.

**నిరంతర పర్యవేక్షణతో మరింత ప్రయోజనం**

కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలంటే అల్పాహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు, చిన్నారుల హాజరు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అంగన్వాడీ సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కూడా భాగస్వాములైతే ప్రభుత్వ లక్ష్యం మరింత సమర్థవంతంగా నెరవేరుతుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కుమ్మరి కుంట్ల జ్యోతి, పద్మ ,శ్రీలత, భద్రమ్మ, సరిత, అంగన్వాడి హెల్పర్లు నాగమణి ,శారద, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కురవిలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- నాటు సారా దందాపై పోలీసుల ఉక్కుపాదం
- లింగ్యా తండాలో అక్రమ విక్రయదారుడి అరెస్ట్
- 5 లీటర్ల కాచిన నాటు సారా స్వాధీనం.
- రూ.2 వేల విలువైన సారాను సీజ్ చేసిన పోలీసులు
- నిందితుడిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు
- అక్రమ సారా దందా చేస్తే కఠిన చర్యలు తప్పవు:



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** కురవి మండల పరిధిలో అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కురవి పోలీసులు కొరడా ఝుళిపించారు. లింగ్యా తండా (బలపాల)లో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.2 వేల విలువైన 5 లీటర్ల కాచిన నాటు సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో కురవి ఎస్సై వి. జయకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పీసీ 1787, పీసీ 3717, డబ్ల్యూపీసీ దేవి (1735)తో కలిసి లింగ్యా తండాలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాలోతు జగ్న (55), తండ్రి అమ్ము నాటు సారా విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు.

**5 లీటర్ల సారా స్వాధీనం.**

నిందితుడి వద్ద ఉన్న 5 లీటర్ల కాచిన నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**ఎక్సైజ్ చట్టం కింద కేసు.**

నిందితుడిపై క్రైమ్ నంబర్ 200/2026 నమోదు చేసి, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్‌లోని యు/ఎస్ 7(ఎ) ఆర్/డబ్ల్యూ 8(ఎ) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని ఎస్సై జయకుమార్ వెల్లడించారు.

**అక్రమ దందాలకు చెక్.**

గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. నాటు సారా కాచినా.. విక్రయించినా.. రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. అక్రమ మద్యం కార్యకలాపాలను ప్రోత్సహించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ బడిని తీర్చిదిద్దుతున్న టీచరమ్మ.. అందరికీ ఆదర్శం!





**దేవరుప్పుల విశాల భారతి;** మండలం లో చిన్న తండా.. ఏడుగురు విద్యార్థులు.. పరిమిత వసతులు.. అయినా సంకల్పం ఉంటే ప్రభుత్వ పాఠశాలను సైతం ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని నిరూపిస్తున్నారు దొడ్లబండ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టేకులపల్లి రజని. దేవరుప్పుల మండలం జెడ్పీహెచ్ఎస్ చిన్నమడూరు కాంప్లెక్స్ పరిధిలోని దొడ్లబండ తండా ప్రాథమిక పాఠశాలలో 2024 డీఎస్సీ ద్వారా నియమితులైన రజని అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నప్పటికీ వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ తెలుగు, ఆంగ్లం, గణితంలో మెరుగైన బోధన అందిస్తున్నారు. ప్రభుత్వం సూచించిన ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందిస్తున్నారు. చదువుతో పాటు ఆటలు, పాటలు, నృత్యం, కంప్యూటర్ ద్వారా డిజిటల్ లెర్నింగ్ వంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నారు. దాతల సహకారంతో సుమారు రూ.40 వేల వ్యయంతో పాఠశాలను రంగురంగుల చిత్రాలు, విద్యార్థులకు ఉపయోగపడే పెయింటింగ్స్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. తాను స్వయంగా రూపొందించిన బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగిస్తూ సులభమైన పద్ధతుల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. "ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మా ప్రభుత్వ బడిలో పిల్లల చదువు, నైపుణ్యాలను తీర్చిదిద్దుతున్నాం" అని రజని పేర్కొంటున్నారు. పాఠశాలలో రికార్డులను సైతం క్రమబద్ధంగా నిర్వహిస్తూ విధుల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రజని పనితీరును కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు డా. జి. కళావతి అభినందించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ భూక్యా అరుణ జనార్ధన్, ఉప సర్పంచ్ బూడిద.సురేందర్, ఏఏపీసీ చైర్మన్ ఎం.డి. గోరిబి, వార్డు సభ్యులు విజయ, నరసింహులు, ఆరోబార్ సైదులు, తల్లిదండ్రులు బానోతు శ్రీను, బాలోత్ శ్రీను, తమ సొంత నిధులతో సహకరించారని రజని తెలిపారు. మూడ దేవేందర్, అంగన్వాడి టీచర్ బి సుజాత, తదితరులు సహకారం కూడా ఉందన్నారు.

## గాంధీ మెడికల్ కళాశాలలో అనాజ్‌పూర్ విద్యార్థినికి వైద్య సీటు

- గ్రామానికి గర్వకారణం సిలివేరు భ్రమరాంబిక : గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రతిభకు పట్టుదల తోడైతే లక్ష్యాన్ని సాధించవచ్చని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సిలివేరు భ్రమరాంబిక నిరూపించిందని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. నీట్‌లో మంచి మార్కులు సాధించి గాంధీ మెడికల్ కళాశాలలో ప్రభుత్వ వైద్య సీటు సాధించిన భ్రమరాంబికను ఆయన అభినందించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సిలివేరు రంగయ్య, ప్రమీల దంపతుల కుమార్తె భ్రమరాంబిక ఇంటర్ విద్యను పూర్తి చేసి నీట్‌లో ప్రతిభ కనబరిచింది. ఆమె సాధించిన ర్యాంక్ ఆధారంగా గాంధీ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం లభించింది. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి భ్రమరాంబికను ప్రత్యేకంగా అభినందించి, ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తమ కుమారుడు కిరణ్‌కుమార్‌ను ఇప్పటికే వైద్యుడిగా తీర్చిదిద్దడంతో పాటు కుమార్తె భ్రమరాంబికను కూడా వైద్యురాలిగా చూడాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని పేర్కొంటూ సిలివేరు రంగయ్య-ప్రమీల దంపతులను చిలుక మధుసూదన్ రెడ్డి అభినందించారు. పిల్లల విద్య కోసం తల్లిదండ్రులు చేసిన కృషి అభినందనీయమన్నారు. భ్రమరాంబిక గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించడం అనాజ్‌పూర్ గ్రామానికే కాకుండా మండలానికి కూడా గర్వకారణమని చిలుక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు.

## తాళ్లపల్లి వేణుగోపాల్ ప్రథమ వర్ధంతి



**ముషీరాబాద్,విశాల భారతి:** తాళ్లపల్లి వేణు గోపాల్ ప్రథమ వర్ధంతి గోపాలపురం కమిటీ హాల్లో శనివారం జరిగింది. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అనంతోజు బ్రహ్మాచారి హాజరై బాల్య మిత్రుడైన తాళ్లపల్లి వేణు చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాల్యాన్ని గుర్తు తెచ్చుకొని భావోద్వానికి లోనయ్యారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో అనంతోజు విమల, స్పందన, తాళ్లపల్లి పద్మశ్రీ, కరణం రమణ, అనిత, రోహిత్, పూజ, దియాన్, దిలీప్ కుమార్,గుండ శుభం, కొమరయ్య, యాదగిరి, కొమురయ్య గౌడ్, తాళ్లపల్లి లక్ష్మి, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేందర్, భారతమ్మ, అంజమ్మ తో పాటు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంతోషి మాత ఆలయంపై దాడిని ఖండించిన కొప్పుల నర్సింహారెడ్డి

- ఆలయాల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషి మాత ఆలయంపై జరిగిన దాడి ఘటనను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి బీజేపీ నాయకులు కొప్పుల నర్సింహారెడ్డి ఆలయాన్ని సందర్శించి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులను కలిసి దాడికి సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల పవిత్రతను, భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించి, ఆలయాలకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ఘటనకు పాల్పడిన నిందితులపై వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై దాడులకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆలయాల భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు, వివిధ హిందూ సంస్థల ప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుజాత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ పరామర్శ

- మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం.. ప్రగాఢ సానుభూతి



**చిన్నగూడూర్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన భర్తాపురం సుజాత గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డీఎస్ రెడ్యా నాయక్ జయ్యారం గ్రామంలోని ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. సుజాత మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట వల్లూరి చెన్నా రెడ్డి, ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చెవుల ముత్తయ్య, బత్తిని శ్రీను, మనోజ్, యాకన్న, బత్తిని రమేష్, ప్రభాకర్, తేనె రామ్మూర్తి, పచ్చిపాల సతీష్, సలీం, ఉమేష్, గునిగంటి వెంకన్న, అక్కనపల్లి అనిల్, తండా యుగంధర్, మంకెని వెంకన్న తదితరులు ఉన్నారు.

# ఓబీసీ మోర్చా ప్రజా సమస్యలపై పోరాడాలి.. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు



**సికింద్రాబాద్, విశాలభారతి :** భారతీయ జనతా పార్టీ మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన కైలాస్ జయంత్, కార్యవర్గ సభ్యులుగా అగుల్ల శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావుని మర్యాద పూర్వకంగా కలిసి ధన్య వాదాలు తెలపడం జరిగింది . బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు మాట్లాడుతూ.... ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను అధికార దృష్టి తీసుకపోయి పరిష్కరించాలని తెలిపారు. అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు సురేష్ కుమార్, మేకల సారంగపాణి, నాగేష్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, శారదా మల్లేష్, హరి,ముతా గణేష్, డివిజన్ అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్. తదితరులకు ధన్యవాదాలు తెలుపడం జరిగింది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



**శాలిగౌరారం మండలం:** గతంలో పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదయి ఉన్నవారు కూడా మళ్లీ ఓటును అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ శనివారం తెలిపారు.ఈ సందర్భంగా వేముల గోపీనాథ్ మాట్లాడుతూ 28 సెప్టెంబర్ 2026 నుంచి 06 నవంబర్ 2026 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.అభ్యర్థి పూర్తి వివరాలతో కూడిన ఫారం-18 దరఖాస్తు చేసుకోవాలని, 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత పొందినట్లు నిర్ధారించే కాన్వొకేషన్ సర్టిఫికెట్ / ప్రొవిజనల్ సర్టిఫికెట్ ,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, సాధారణ ఓటర్ ఐడీ జిరాక్స్ కాపీ, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, మొబైల్ నంబర్ అర్హత ఉన్న పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు.

# హామీలు ఎక్కడ.. అభయహస్తం ఎక్కడ?

- **చేవెళ్ల డిక్లరేషన్ హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన మాదిగ హక్కుల పరిరక్షణ సమితి**
- **రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం ఏమైంది**
- **ఖర్గే, రాహుల్, రేవంత్ సమాధానం చెప్పాలి.**
- **మాట నిలబెట్టుకోకుంటే ఎస్సీ, ఎస్టీల పక్షాన ఉద్యమం**

**ఉధృతం చేస్తాం: మైస ఉపేందర్ మాదిగ.**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని, చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ ఆరోపించారు. ముఖ్యంగా అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీపై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన మాదిగ హక్కుల పరిరక్షణ సమితి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి వారి అభివృద్ధికి బాటలు వేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా దళితుల అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలులో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు.

**చేవెళ్ల హామీకి లెక్క చెప్పాలి.**

చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం హామీ అమలు ఎప్పుడు చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. హామీ ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

**మాటలతో కాలయాపన వద్దు.**

దళితుల అభివృద్ధి పేరుతో ప్రకటనలు చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపాలని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.

**అభయహస్తం వచ్చే వరకు పోరాటం.**

ఎస్సీ, ఎస్టీలకు అంబేద్కర్ అభయహస్తం అందించే వరకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఉపేందర్ మాదిగ ప్రకటించారు. దళితుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

**జిల్లా అధ్యక్షుడిగా బైగళ్ళ వీరబాబు.**

కార్యకర్తల సమావేశం అనంతరం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బైగళ్ళ వీరబాబును నియమించారు. జిల్లాలో సంస్థను బలోపేతం చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో మందుల సంతోష్, మందుల శ్రీనివాస్, మందుల శ్రీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- **ఉప సర్పంచుల చెక్ పవర్ ఆంక్షలు తొలగించాలి**
- **తెలంగాణ ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాలరాజు డిమాండ్**




**చౌటుప్పల్,విశాల భారతి:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలు ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాలరాజు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను విద్యుత్ బిల్లుల పేరుతో రాష్ట్ర ఖజానాకు మళ్లిస్తున్నారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులు, ఉప సర్పంచులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే భయంతోనే వారి మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కొంతమంది స్వార్థపరుల ఫిర్యాదు మేరకు ఉప సర్పంచుల జాయింట్ చెక్ పవర్ పై 7 రోజుల్లో సంతకం చేయాలని ఆంక్షలు విధించడం అవినీతిని ప్రోత్సహించినట్లేనని విమర్శించారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీరాజ్ చట్టం ద్వారా అవినీతి జరగకుండా, పారదర్శకత కోసం ఉప సర్పంచులకు జాయింట్ చెక్ పవర్ కల్పించారని గుర్తు చేశారు. ఎవరైనా అకారణంగా సంతకం చేయకుంటే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలే తప్ప, మొత్తం ఉప సర్పంచులందరిపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఈ ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని, ఉప సర్పంచులకు రూ.5000 గౌరవ వేతనం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యుత్ సమస్యలపై కోదాడ సబ్‌స్టేషన్ ముట్టడి

**విశాల భారతి కోదాడ:** కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మార్చకపోవడం, నిరంతర విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహించిన రైతులు శనివారం కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ బైఠాయించి నిరసన తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు ఆధ్వర్యంలో తమ్మర, గణపవరం, ద్వారకుంట, యతిరాజపురం తండా గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు బయటకు వెళ్లకుండా అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు ఎడాపెడా కోతలు విధిస్తుండటంతో పాటు కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఇవ్వడానికి నెలల తరబడి తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు.

# హస్తాల వీరభద్ర స్వామి ఆలయ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **అక్రమ నిర్మాణాలను తొలగించి ఆలయ భూములను పరిరక్షించాలి: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉప్పరిపల్లి గ్రామ పరిధిలోని చింతల్‌మెట్‌లో ఉన్న హస్తాల వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పుష్కరిణి మధ్యలో గోడ నిర్మించారని ఆరోపిస్తూ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ఈ విషయాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్‌తో కలిసి స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆలయ భూములను పరిశీలించారు.

అనంతరం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆలయ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆక్రమణకు గురైన భూములను తిరిగి ఆలయానికి అప్పగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాలకు సంబంధించిన భూములు, పుష్కరిణులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. హస్తాల వీరభద్ర స్వామి ఆలయాన్ని, దాని ఆస్తులను పరిరక్షించేందుకు ఎంత దూరమైనా వెళ్తామని స్పష్టం చేశారు. ఆలయ పూజా కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి ఆలయ పరిరక్షణ కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఆలయ భూముల పరిరక్షణ కోసం యువత, భక్తులు, స్థానిక ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా నాయకులు వై.సీధర్, కొమురయ్య, బొక్క బాల్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, దీపక్ యాదవ్, కిట్టు గౌడ్, వంశీ యాదవ్, సులిగి వెంకటేష్, అమర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సందీప్ గౌడ్, రమణ రాజు గౌడ్, నర్సింగ్, మహేందర్ గౌడ్, సిద్దేశ్వర, శ్రీకాంత్ రెడ్డి, ఉదయ్ కుమార్, సందీప్ ముదిరాజ్, బాబురావు, విటల్, శ్రీను, రాజు, ఉమేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు, బజరంగ్ దళ్ నాయకులు, స్థానిక యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి ప్రేమ్ వత్సా సన్మానం




- **ఎం.సి. వత్సా పేర నూతన జూనియర్ స్కూల్ బ్లాక్**

**సికింద్రాబాద్, విశాల భారతి :** బేగంపేటలోని ప్రఖ్యాత హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి, అంతర్జాతీయ ఆర్థిక దిగ్గజం ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్ చైర్మన్ ప్రేమ్ వత్సాను శనివారం ఘనంగా సత్కరించింది. 1965 బ్యాచ్‌కు చెందిన ఆయన పాఠశాలను సందర్శించిన సందర్భంగా యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇదే వేదికపై పాఠశాలలో అత్యాధునిక వసతులతో నిర్మించనున్న నూతన జూనియర్ స్కూల్ బ్లాక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1969 నుంచి 1972 వరకు హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలందించిన ప్రేమ్ వత్సా తండ్రి, దివంగత ఎం. సి. వత్సా గౌరవార్థం ఈ నూతన భవనానికి ఆయన పేరు పెట్టడం విశేషం. పాఠశాలతో వత్సా కుటుంబానికి తరాలుగా ఉన్న ఆత్మీయ అనుబంధానికి, ప్రేమ్ వత్సా అందిస్తున్న నిరంతర తోడ్పాటుకు గుర్తింపుగా ఈ సన్మానం సాగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీ అధ్యక్షులు గుస్తి జె. నోరియా మాట్లాడుతూ.... ప్రేమ్ వత్సా లాంటి అంతర్జాతీయ స్థాయి నాయకుడికి స్వాగతం పలకడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. హెచ్‌పీఎస్ తరగతి గదుల నుంచి ప్రపంచ స్థాయి శిఖరాలకు ఎదిగిన ఆయన ప్రయాణం సంస్థ అందించిన విలువలు, క్రమశిక్షణకు నిదర్శనమని కొనియాడారు. ప్రేమ్ వత్సాతో పాటు నళిని వత్సా రాక పాఠశాలకు మరింత శోభను తెచ్చిందని, వత్సా కుటుంబ తరాలను నేటి విద్యార్థి తరాలతో అనుసంధానించే అద్భుత ఘట్టం ఇదని చెప్పారు. పాఠశాల గతాన్ని గౌరవిస్తూనే, భావి తరాల పిల్లలను భావి ఆలోచనలతో తీర్చిదిద్దే లక్ష్యంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ఇక్కడి విద్యార్థులు కేవలం సమాధానాలు ఇచ్చేవారిగా కాకుండా అన్వేషకులుగా ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. సన్మాన గ్రహీత, ఫెయిర్‌ఫాక్స్ చైర్మన్ ప్రేమ్ వత్సా మాట్లాడుతూ.... తనకు జీవితాన్ని ఇచ్చిన మాతృసంస్థ హెచ్‌పీఎస్‌కు తిరిగి రావడం ఎప్పుడూ అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుందని భావోద్వేగానికి గురయ్యారు. తను ఈ స్థాయికి చేరుకోవడంలో ఇక్కడ గడిపిన రోజులు, నేర్చుకున్న పాఠాలు పునాదిగా నిలిచాయని గుర్తుచేసుకున్నారు. హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్‌గా సేవలు అందించిన తన తండ్రి ఎం.సి. వత్సా పేరుతో కొత్త జూనియర్ స్కూల్ బ్లాక్‌ను నిర్మించడం తమ కుటుంబానికి దక్కిన గొప్ప గౌరవమని, ఇది తమకెంతో భావోద్వేగమైన సందర్భమని ఆనందం వ్యక్తం చేశారు. పురాతన విలువలను నిలబెట్టుకుంటూనే పాఠశాల ఆధునిక పోకడలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతుండటం గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం హెచ్‌పీఎస్ పూర్వ వైభవాన్ని, వర్తమాన ప్రగతిని, ఉజ్వల భవిష్యత్తును ఒకే వేదికపైకి తెచ్చి మరపురాని జ్ఞాపకంగా నిలిచింది. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, పల్లంరాజు తదితరులు హాజరయ్యారు.

# న్యాయస్థానం ఆదేశాల మేరకే భూమి రిజిస్ట్రేషన్



- **వాస్తవాలు పూర్తిగా పరిశీలించకుండా రెవెన్యూ అధికారులపై ఎఫ్ఐఆర్ చేయడం బాధాకరం**
- **బాధితులు మహమ్మద్ హైమద్ ఎండి ఖలీల్**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి గ్రామంలోని సర్వే నెంబర్ 361 లోని 8ఎకరాల 29 గుంటల భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తవమని బాధితులు మహమ్మద్ హైమద్, ఎండి ఖలీల్ సిద్ధిక్ తెలిపారు. శనివారం యాచారం కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యాయస్థానాల ఆదేశాల మేరకే సంబంధిత భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని స్పష్టం చేశారు. నందివనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361/AA, ఖాతా నంబర్ 155లో ఉన్న 5 ఎకరాల 11 గుంటల భూమికి సంబంధించి ఓఎస్ నంబర్ 547/2021 కేసులో ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2022 జూలై 26న విక్రయ పత్రం అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. అనంతరం పిటిషనర్ దాఖలు చేసిన ఈపీ నంబర్ 18/2023 ప్రక్రియలో భాగంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జారీ చేసిన డిస్ నంబర్లు 167/2025, 168/2025 లేఖల ఆధారంగా కోర్టు రికార్డు అసిస్టెంట్ ద్వారా సేల్‌డీడ్ నమోదుకు ప్రతిపాదన వచ్చినట్లు వివరించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్ నంబర్ 35037/2025లో 2025 నవంబర్ 19న న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. కోర్టు నిర్దేశించిన నిబంధనలు, స్లాట్ బుకింగ్ ఆధారంగానే రిజిస్ట్రేషన్ అధికారి సదరు సేల్‌డీడ్‌ను నమోదు చేసి విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో తహసీల్దార్ లేదా రెవెన్యూ సిబ్బంది ఎలాంటి రికార్డులను తారుమారు చేయలేదని స్పష్టం చేశారు.

**కోర్టును ఆశ్రయించాలి....**

వాస్తవాలను పూర్తిగా పరిశీలించకుండానే రెవెన్యూ అధికారులపై ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బాధాకరమని వారు అన్నారు. రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పనిచేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

**కొనుగోలుదారుల వాదన...**

నందివనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361/AAలోని 5 ఎకరాల 11 గుంటల భూమిని తాము కొనుగోలు చేసినప్పటికీ విక్రేత రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించామని మహమ్మద్ హైమద్, ఎండి ఖలీల్ సిద్ధిక్ తెలిపారు. కోర్టు పలుమార్లు రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించినప్పటికీ విక్రేత స్పందించకపోవడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకే రిజిస్ట్రేషన్ జరిగిందని చెప్పారు. రిజిస్ట్రేషన్ అనంతరం సదరు భూమిని మరో వ్యక్తికి విక్రయించినట్లు తెలిపారు. కోర్టు తీర్పుతో విభేదిస్తున్న విక్రేత కుటుంబ సభ్యులు అధికారులపై, భూ యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారని, అధికారులపై తీసుకోవాల్సిన చర్యల విషయంలో న్యాయస్థానమే తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

# భీముని పాదం వద్ద వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు




**విశాల భారతి గూడూరు అక్టోబర్ 3;** గూడూరు మండలంలోని భీముని పాదం వద్ద యాత్రికులకు వన్యప్రాణి సంరక్షణ వాటి ఉపయోగాల గురించి యాత్రికులకు అవగాహన కల్పించినా ఫారెస్ట్ సిబ్బంది ఈ కార్యక్రమంలో బుజ్జిబాబు డిఆర్ఓ సుగుణ ఎఫ్ బి ఓ విజయ ఎఫ్ బి ఓ యాత్రికులు పాల్గొనడం జరిగింది

# సర్వే నంబర్ 361లో ఎలాంటి అక్రమాలు జరగలేదు

- **న్యాయస్థానం ఆదేశాల మేరకే రిజిస్ట్రేషన్**
- **నకిలీ పత్రాల ఆరోపణల్లో వాస్తవం లేదు**
- **రికార్డులు పరిశీలించిన తర్వాతే ప్రక్రియ**
- **అధికారులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేవు**
- **ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361లో 5 ఎకరాల 11 గుంటల భూమికి సంబంధించి ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగలేదని ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నకిలీ పత్రాల ఆధారంగా తహసీల్దార్, ఇతర అధికారులు భూమిని రిజిస్ట్రేషన్ చేశారంటూ ఇటీవల ప్రచురితమైన వార్తలపై విచారణ చేపట్టగా వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆర్డీఓ తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 361లోని భూమికి సంబంధించి మహ్మద్ బషీర్, మహ్మద్ నజీర్ పేర్లతో ఉన్న భూమిని నకిలీ పత్రాలతో అక్రమంగా పట్టాలుగా మార్చి రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రికార్డులు, పత్రాలను పరిశీలించి అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా భూమికి సంబంధించిన పాత లావాదేవీలు, ఒప్పంద పత్రాలు, న్యాయస్థానం ఉత్తర్వులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను పరిశీలించినట్లు ఆర్డీఓ తెలిపారు. ఇందులో భాగంగా 582021న మహ్మద్ బషీర్, మహ్మద్ నజీర్ నుంచి మహ్మద్ హైమద్‌కు అమ్మకపు ఒప్పందం జరిగినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఒప్పందం సమయంలో మహ్మద్ హైమద్ కొంత మొత్తాన్ని చెల్లించినట్లు రికార్డుల్లో ఉన్నట్లు తెలిపారు. అయితే అనంతరం ఒప్పందం ప్రకారం తనకు భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదని పేర్కొంటూ మహ్మద్ హైమద్ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు ఆర్డీఓ వివరించారు. ఈ మేరకు ఓఎస్ నంబర్ 547/2021లో న్యాయస్థానంలో దావా దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో న్యాయస్థానం సంబంధిత పక్షాలకు కొంత సమయం ఇచ్చి, నిర్దేశిత వ్యవధిలో స్పందన లేకపోతే మహ్మద్ హైమద్‌కు భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించినట్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలోనే తదుపరి ప్రక్రియ కొనసాగినట్లు ఆయన స్పష్టం చేశారు.

**న్యాయస్థానం ఆదేశాల మేరకే ప్రక్రియ**

2025లో సంబంధిత వ్యక్తి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు. అందుబాటులో ఉన్న రికార్డులు, న్యాయస్థానం ఆదేశాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ లేదా ఇతర రెవెన్యూ అధికారుల స్థాయిలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేసే క్రమంలోనే సంబంధిత ప్రక్రియను అధికారులు చేపట్టారని తెలిపారు.

**రికార్డుల ఆధారంగానే విచారణ**

భూములకు సంబంధించిన వ్యవహారాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులు, పాత పత్రాలు, ఒప్పందాలు, న్యాయస్థానం ఉత్తర్వులు తదితర అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. నంది వనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361 భూమి విషయంలోనూ ఇదే విధంగా పూర్తి వివరాలను పరిశీలించినట్లు చెప్పారు. అందువల్ల సర్వే నంబర్ 361లో నకిలీ పత్రాలతో అధికారులు భూమిని రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలకు ఆధారాలు లేవని, అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం అధికారుల వైపు ఎలాంటి అక్రమం జరగలేదని ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

# గురు నానక్ విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థుల సందడి

- **25 ఏళ్ల అనుబంధానికి ప్రతీకగా ఘనంగా సమ్మేళనం.**
- **దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు.**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** గురు నానక్ విద్యాసంస్థల ప్రాంగణం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో సందడిగా మారింది. "25 సంవత్సరాలు ఒకే కుటుంబం" అనే సందేశంతో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. వివిధ విద్యా సంవత్సరాలు, విభాగాలకు చెందిన పూర్వ విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి కూడా ప్రత్యేకంగా హాజరై తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గురు నానక్ సంస్థల ఉపాధ్యక్షుడు, గురు నానక్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు విద్యాసంస్థతో కొనసాగిస్తున్న అనుబంధం అభినందనీయమన్నారు. విద్యాసంస్థ అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. గురు నానక్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, గురు నానక్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ విద్యాసంస్థకు వారధిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. తమ అనుభవాలు, వృత్తిపరమైన నైపుణ్యాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకోవడం ద్వారా వారికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో పని చేస్తున్న వారు తమ వృత్తి ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకోవడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డా. ఎస్. శ్రీనాథ రెడ్డి, డా. పి. పార్థసారథి, డా. రిషి సయల్, డా. ఎస్.వీ. రంగనాయకులు, చీఫ్ లైబ్రేరియన్ సింగయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 25 సంవత్సరాలు – ఒకే కుటుంబం" అనే నినాదంతో నిర్వహించిన సామూహిక ఛాయాచిత్ర కార్యక్రమం పూర్వ విద్యార్థుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. పాత స్నేహితులు, అధ్యాపకులు ఒకచోట చేరి జ్ఞాపకాలను పంచుకోవడం ఆత్మీయ వాతావరణాన్ని తీసుకొచ్చింది. కార్యక్రమ సమన్వయకర్తలుగా డా. బి. కేదార్‌నాథ్, డా. సందీప్ పాటిల్ వ్యవహరించారు. సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 20న నిర్వహించనున్న గురు నానక్ విద్యాసంస్థల రజతోత్సవ వేడుకలకు ఈ సమ్మేళనం ముందస్తు కార్యక్రమంగా నిలిచిందని తెలిపారు.

# ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

**విశాల భారతి బీబీనగర్ :** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ పొట్టోళ్ల శ్యామ్‌గౌడ్ తెలిపారు. బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల, పల్లెగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరికొద్ది రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

విశాల భారతి





## రెండు వారాల గ్యాప్‌లో సాయిపల్లవి రెండు పాన్ ఇండియా సినిమాలు..

ఒక సినిమా కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్న సమయంలోనే అదే హీరో లేదా హీరోయిన్ నటించిన మరో సినిమా థియేటర్లలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? సాధారణంగా ఒకే నటుడి సినిమాలు తక్కువ గ్యాప్‌లో విడుదలైతే బాక్సాఫీస్ పరంగా పోటీ నెలకొనే అవకాశం ఉంటుంది. అయితే స్టార్ హీరోయిన్ సాయిపల్లవి విషయంలో ఇప్పుడు ఇదే పరిస్థితి కాస్త ఆసక్తికరంగా మారింది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు కేవలం రెండు వారాల వ్యవధిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సాయిపల్లవికి ఇది నటిగా మంచి అవకాశంగా కనిపిస్తున్నప్పటికీ, రెండు సినిమాల నిర్మాతలకు మాత్రం థియేటర్ల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నవంబర్ 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సాయిపల్లవి సీత పాత్రలో కనిపించనుండటంతో ఆమె పాత్రపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'రామాయణ: పార్ట్ 1' విడుదలైన సరిగ్గా రెండు వారాల తర్వాత సాయిపల్లవి నటించిన మరో భారీ చిత్రం 'ఓం: చాప్టర్ 1 – ఉదిరం' థియేటర్లలోకి రానుంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.